భక్తుడికి తొలిపూజ

- ఆగమోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం
- శ్రీకాళహస్తీశ్వరుడి మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ


ముక్కంటి ఆలయం నుంచి కొండపైకి చేరుకుంటున్న భక్తకన్నప్ప ఉత్సవమూర్తి - కన్నప్ప గుడి వద్ద ధ్వజారోహణం చేపడుతున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భక్తుడికే తొలిపూజ అందింది. శ్రీకాళహస్తీశ్వరుడి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం భక్తకన్నప్పకు ఆగమోక్తంగా ధ్వజారోహణం జరిగింది. తనకు పరమభక్తుడైన కన్నప్పకు కొండపై స్థానం కల్పించి తొలి పూజ చెందేలా శివుడు వరమిచ్చాడని పురాణోక్తి. అందుకనే మహాశివరాత్రి ఉత్సవాల్లో తొలిగా కన్నప్పకు ధ్వజారోహణం నిర్వహించడం ఆనవాయితీ. తొలుత ముక్కంటి ఆలయంలో స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. కన్నప్ప ఉత్సవమూర్తిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. అభిషేక పూజలు నిర్వహించాక మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ కన్నప్ప కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కన్నప్ప ఆలయం ఎదుట ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. ముక్కోటి దేవతలకు సంకల్ప పూజలతో వేదపండితులు ఉత్సవాలకు శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికారు. ధ్వజారోహణ క్రతువులో భాగంగా కన్నప్ప ధ్వజస్తంభానికి పూజలు చేశారు. అనంతరం దర్భమామిడి ఆకులతో కట్టిన తెల్లదారంతో ధవళపతాకం, పూలహారాన్ని ఎగురవేసి హారతులను సమర్పించి ఉత్సవాలకు అంకురార్పణ పలికారు. అనంతరం కన్నప్ప ఉత్సవమూర్తిని ముక్కంటి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. సన్నిధివీధిలో బోయ కులస్థులు ఏర్పాటు చేసిన విడిది మండపంలో కొలువుదీర్చారు. సంప్రదాయం ప్రకారం ఉభయదారులైన బోయలు వస్త్రం, నైవేద్యం సమర్పించాక గ్రామోత్సవం ప్రారంభమైంది. సన్నిధివీధి నుంచి రాజగోపురం వరకు, అటు నుంచి చతుర్మాడ వీధుల్లో కన్నప్ప గ్రామోత్సవం సాగింది. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉత్సవాల్లో తొలి రోజు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు గ్రామోత్సవాన్ని దర్శించుకున్నారు. ఇక, స్వామివారి ధ్వజారోహణకు ముందు ఆలయంలో వాస్తు పూజ చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయంలోని అద్దాల మండపం వద్ద పూజలు నిర్వహించి, వాస్తు శాంతి పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఆలయ అధికారులు, బొజ్జల బృందమ్మ తదితరులు పాల్గొన్నారు. ధూర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలను శుక్రవారం ప్రారంభించారు.


పురవీధుల్లో ఊరేగుతున్న భక్తకన్నప్ప

ముక్కంటి బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8.30 గంటలకు వెండి అంబారీ సేవ
- 12.30 నుంచి స్వామివారి ధ్వజారోహణం
- రాత్రి 8 గంటలకు వెండి అంబారి సేవ


ఆలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

బ్రహ్మోత్సవ శోభ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఎటు చూసినా పూల అలంకరణలు, విద్యుత్ దీపాలంకరణలతో పట్టణమంతా బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. ఆలయ ద్వారాలపై భిక్షాల గాలి గోపురం, సుపథ మండపం వద్ద పూలతో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు, ఆలయం లోపల ధ్వజస్తంభం, దక్షిణామూర్తి సన్నిధి, స్వామిఅమ్మవార్ల సన్నిధిలో ఉత్సవ కళ ఉట్టిపడింది. పట్టణంలోని ప్రధాన మార్గాలతో పాటు చతుర్మాడవీధులు అరటిచెట్లు, మామిడి తోరణాలతో కళకళలాడుతున్నాయి.



ఆలయంలో అలంకరణలు - ఆకర్షణీయంగా దర్శనమిస్తున్న ధ్వజస్తంభం

'తొక్కిసలాట' ఘటనపై

రెండో దశ విచారణ

- తిరుపతికి చేరుకున్న జస్టిస్ సత్యనారాయణమూర్తి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జనవరి 8న వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై రెండో దశ విచారణ శనివారం నుంచి మొదలు కానుంది. ఆ ఘటనలో ఆరుగురు మృతి చెందడం, 46మంది గాయపడటంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుదది. ఈ ఘటనపై నిజనిజాలు వెలికి తీయాని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి నేతృత్వంలో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. మొదటిదశలో పలువురిని విచారించింది. రెండో దశ విచారణకు గాను శుక్రవారం రాత్రి న్యాయవిచారణ కమిటీ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. శనివారం తొక్కిసలాటలో గాయపడిన బాధితులతో పాటు మృతి చెందిన ఆరుగురు కుటుంబసభ్యుల నుంచీ వివరాలు సేకరించనున్నారు. పద్మావతిపార్కు ఎదురుగా ఉన్న 20 దుకాణాల నిర్వాహకులను విచారిస్తారు. పదిరోజులు సుదీర్ఘంగా తొక్కిసలాట ఘటనపై కమిటీ విచారించింది.ఇప్పటికే 70మందికి నోటీసులు జారీ చేశారు. బాధితుల విచారణానంతరం సస్పెండైన డీఎస్పీ, గోశాల డైరెక్టర్, బదిలీ అయిన ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమితో పాటు ఆయా కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న రెవెన్యూ తహసీల్దార్లు, కీలకమైనపోలీసు అధికారులను విచారించనున్నారు.

రేపు సీఎం చంద్రబాబు రాక


అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష

తిరుపతి/రేణిగుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదివారం రేణిగుంట రానున్నారు. ఉదయం 8 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. రోడ్డు మార్గాన తూకివాకం సమీపంలోని ఆర్‌పీఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ కుమారుడి వివాహానికి హాజరు కానున్నారు. వధూవరులను ఆశీర్వదించిన అనంతరం విజయవాడకు తిరుగు ప్రయాణం కానున్నారు. విమానాశ్రయం వద్ద, ఫంక్షన్ హాలు, ఆ రోడ్డు మార్గంలో భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఇతర అధికారులు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. సమీక్షలు నిర్వహించారు. అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీనివాసులు, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో బాలాజీ నాయక్, జిల్లా అధికారులు, విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావు, తహసీల్దారు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, అధికారికంగా సీఎం చంద్రబాబు పర్యటన ఇంకా ఖరారు కాలేదు.

ఏఎస్పీ ప్రభాకర్‌బాబుపై క్రమశిక్షణ చర్యలు

తిరుమల, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): గతంలో తిరుమల డీఎస్పీగా అధికార హోదాను దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలున్న, ప్రస్తుత ఏఎస్పీ టీటీ ప్రభాకర్‌బాబుపై క్రమశిక్షణ చర్యలు ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఎస్పీగా విధులు నిర్వహించిన సమయంలో అనుచిత ప్రవర్తనతో పాటు పలు నిబంధనలు ఉల్లంఘించనట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. తన వ్యక్తిగత పనులకు సిబ్బందిని వాడుకున్నారనే విమర్శలు వచ్చాయి. వీటన్నింటికి సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాలను కూడా సమర్పించిన క్రమంలో క్రమశిక్షణ చర్యల నిర్ణయం తీసుకున్నామని ఆ జీవోలో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు అందుకున్న 15 రోజుల్లోపు ప్రభాకర్ బాబు తన వాదనను లిఖితపూర్వకంగా సమర్పించాలని జీవోలో స్పష్టం చేశారు. ప్రస్తుతం అదనపు ఎస్పీ హోదాలో సెలవుపై ఉన్న ప్రభాకర్‌బాబుపై క్రమశిక్షణ చర్యలు ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు.

అసైన్డ్ భూముల్లో గ్రావెల్ తరలించే

హక్కు ఎవరికీ లేదు

తిరుపతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'దొరవారిసత్రం మండలం పూలతోటమిట్టలో గ్రావెల్ తరలిస్తున్న భూములు సీజేఎఫ్ఎస్ నుంచి అసైన్డ్‌గా మారినవి. ఈ భూముల్లో గ్రావెల్‌ను తరలించే హక్కు ఎవరికీ లేదు' అని ఆ మండల తహసీల్దారు శైలాకుమారి స్పష్టంచేశారు. కొన్ని రోజులుగా గ్రావెల్ తరలిస్తున్న ఆ భూములను శుక్రవారం ఆమె రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. గ్రావెల్ తరలింపునకు ముందస్తు అనుమతులు తప్పనిసరన్నారు. పూర్తి విచారణ అనంతరం తదుపరి చర్యలతో పాటు, ఆ భూముల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలియజేశారు.


గ్రావెల్ తరలించే అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న తహసీల్దారు శైలాకుమారి

బాలలూ... ఇస్రో పిలుస్తోంది

- ఇస్రో యువికా 2025 దరఖాస్తుల ఆహ్వానం

సూళ్లూరుపేట,ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత, మేధస్సును వెలికితీసి, ప్రత్యేక శిక్షణనిచ్చి యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇస్రో అవకాశం కల్పిస్తోంది. దీనికోసం యువ విజ్ఞాని కార్యక్రమం (యువికా) పేరిట 2025 జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల24 నుంచి మార్చి 23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్స్‌లో తెలిపింది. 'క్యాచ్ దెమ్ యంగ్' పేరిట రెండు వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో అంతరిక్ష, సాంకేతికత, విజ్ఞానం, అప్లికేషన్లపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. విద్యార్థి దశలోనే విజ్ఞానం, సాంకేతికత, ఇంజినీరింగ్, మ్యాథమేటిక్స్ (స్టెమ్) అంశాలపై అవగాహన కల్పించి తద్వారా వారిని అంతరిక్ష పరిశోధనల వైపు దృష్టి మళ్లించడమే దీని లక్ష్యం.

చిన్నారుల హాహాకారాలు


బోల్తాపడ్డ బస్సులో నుంచి చిన్నారులను బయటకు తీస్తున్న స్థానికులు

నవ్వుతూ, కేరింతలతో బస్సులో వస్తున్నారా చిన్నారి విద్యార్థులు. ఒక్కసారిగా బస్సు కుదుపుతో ఆందోళన చెందారు. ఆపై బోల్తాపడిన బస్సులో నుంచి చిన్నారుల హాహాకారాలు మిన్నంటాయి. శుక్రవారం ఉదయం తడ మండలం కరిపేటికాలువ బ్రిడ్జిపై వెళుతున్న నారాయణ విద్యాసంస్థల స్కూల్ బస్సు టైర్ల వద్ద కట్టలు విరిగిపోవడంతో అదుపు తప్పి రైలింగ్‌ను ఢీ కొని 15 అడుగుల లోతులో రోడ్డు పక్కకు వెళ్లి బోల్తా కొట్టింది. ఆ సమయంలో 37 మంది విద్యార్థులు ఉన్నారందులో. డ్రైవరు వినోద్‌కు కాలు విరగ్గా, చిన్నారి రిషితకు నాలుగు తెగి గాయమైంది. మిగిలిన లిఖిత్, భరత్, నానీష్, గోకులకృష్ణ, యువశ్రీ, గీతిక, జస్మిత, క్రిషిక, నవ్యశ్రీ, సంజన, దర్శిక్, లక్ష్మీచరణ్, మహిత్‌కుమార్, కుముదశ్రీ, నిషిత్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు కలిసి చిన్నారులను బయటకు తీసి ఆస్పత్రులకు తరలించారు. వీరి రోదనలు మిన్నంటాయి.


గాయాలైన చిన్నారులు క్రిషిత, యువశ్రీ, గీతిక

\- తడ, ఆంధ్రజ్యోతి

దేవుడా.. ఇదేమి ఘోరం

- తలనీలాలు ఇచ్చేందుకు వచ్చి.. రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి
- మరో ముగ్గురికి గాయాలు


ప్రమాదానికి కారణమైన బస్సు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'దేవుడా.. ఇదేమి ఘోరం' అంటూ ఛిద్రమైన చిన్నారి మృతదేహంతో.. అర్ధరాత్రి వేళ.. రోడ్డుపై తల్లిదండ్రులు విలపించారు. ఒక్కగానొక్క కుమార్తె కళ్లెదుటే ప్రాణాలు కోల్పోవడంతో వారు షాక్‌కు గురయ్యారు. ఈ విషాద ఘటన తిరుపతి రూరల్‌లో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. తమ మూడేళ్ల చిన్నారి హరిప్రియకు తిరుమలలో తలనీలాలు సమర్పించేందుకు శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం ఓబులదేవిచెరువు గ్రామానికి చెందిన వేణుగోపాల్, అశ్విని దంపతులు, మహిళతో కలిసి గురువారం వచ్చారు. తొలుత వీరు శ్రీకాళహస్తికి వెళ్లారు. శివయ్యను దర్శించుకున్నారు. అర్ధరాత్రి తిరుమలకు కారులో బయలుదేరారు. జాతీయ రహదారి నుంచి ఆర్సీపురం సర్కిల్లో తిరుపతికి వచ్చేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో బెంగళూరు నుంచి విశాఖపట్నంకు వెళుతున్న ప్రైవేటు బస్సు వేగంగా వచ్చి వీరి కారును ఢీకొంది. ఈ ఘటనలో హరిప్రియ అక్కడికక్కడే మృతిచెందింది. డ్రైవింగ్ చేస్తున్న వేణుగోపాల్ వెనుక సీట్లో కూర్చొని ఉన్న ఆయన భార్య అశ్విని, మరో మహిళ గాయాలతో బయటపడ్డారు. కారులో ఛిద్రమైన హరిప్రియ మృతదేహాన్ని స్థానికులు బయటకు తీశారు. మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు బోరున విలపించారు.'దేవుడా ఇదేమి ఘోరం'అంటూ అర్ధరాత్రి నడిరోడ్డుపై ఆ తల్లిదండ్రుల ఆక్రందనలు అటుగా వెళ్లే వారితో కన్నీరు పెట్టించాయి. ఒక్కగానొక్క కుమార్తె మాంసపు ముద్దలా మారడాన్ని చూసిన ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. తిరుపతి రూరల్ పోలీసులు బస్సు డ్రైవరు గురుశాంత్‌ను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


చిన్నారి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

నేడు కల్యాణ వెంకన్న గరుడోత్సవం



కల్పవృక్ష వాహన సేవలో చిన్నారుల కోలాటం





వాహనసేవలో సాంస్కృతిక ప్రదర్శనలు

చంద్రగిరి,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలో కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం వాహన సేవల్లో కళా బృందాలు భక్తులను ఆకట్టుకున్నాయి. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టు ఆధ్వర్యంలో 6 కళా బృందాలు, 80 మంది కళాకారులు సంగీత నృత్య ప్రదర్శనలతో భక్తిపారవశ్యంలో ముంచెత్తారు. ఐదోవరోజు శనివారం రాత్రి 8 నుండి 10 గంటల వరకు గరుడ వాహన సేవను వైభవంగా నిర్వహించానున్నారు. ఈమేరకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆలయాన్ని శోభాయమానంగా పుష్పాలతో అలంకరించారు. విద్యుద్దీపాలంకరణలు మిరుమిట్లుగొలుపుతున్నాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, పాలు పంపిణీ చేయనున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్ విభాగాల సమన్వయంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం నుంచి ఆమార్గంలో వాహనాలను చంద్రగిరి వైపు మళ్ళించనున్నారు. గరుడసేవలో అలంకరించేందుకు లక్ష్మీకాసుల హారాన్ని తిరుపతి టీటీడీ పరిపాలన భవనం నుంచి శోభయాత్రగా తీసుకురానున్నారు. గరుడోత్సవంలో దీనిని స్వామివారికి అలంకరించనున్నారు. గోవిందరాజస్వామి ఆలయం నుండి ఆండాళ్ అమ్మవారి మాలలను ఊరేగింపుగా తీసుకువస్తారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి

పాకాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా అధ్యక్షతన తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా మాతృబాషను మరువరాదన్నారు. పీవీకెఎన్ ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ చెన్నకేశవులు భాషా సాహిత్యాల అధ్యయనం వల్ల ఆనందం, సందేశం అనే ప్రయోజనాలు కలుగుతాయన్నారు. మాతృభాష అవసరాన్ని శాస్త్రీయంగా వివరించారు. సెమిస్టర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ ఈశ్వరబాబు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం జరిగింది. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షుడు దొడ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు పద్యపఠనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



పాకాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అడవులను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని ఫారెస్ట్ బీట్ అధికారి ఎస్. హయ్యూద్ బాషా కోరారు. గాదంకి సచివాలయంలో శుక్రవారం ఆయన వన్యప్రాణుల సంరక్షణ, అగ్ని ప్రమాదాలతే జరిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అడవులకు నిప్పుపెడితే జీవరాశికి, మానవాళి మనుగడకు నష్టం జరుగుతుందన్నారు. మొక్కలను నాటి సంరక్షించి కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇరుగు గురుమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మయూర, సింహ వాహనాలపై దర్శనం



చంద్రగిరి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తొండవాడ అగస్త్యేశ్వరాలయంలో మహాశిరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం మయూర వాహనంపై సుబ్రమణ్యంస్వామి, రాత్రి సింహవాహనంపై ఆనందవళ్ళిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం రుద్రాభిషేకం నిర్వహించి, ఆనందవళ్ళిదేవికి అభిషేకం చేసి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథ రెడ్డి, పాల్గొన్నారు.

పకడ్బందీగా భూమి రీసర్వే నిర్వహించండి



రీసర్వేను ప్రారంభిస్తున్న వెంకటరమణ

రామచంద్రాపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భూరీసర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దారు వెంకటరమణ సూచించారు. శుక్రవారం సొరకాయలపాలెంలో భూరీసర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూ రీసర్వేకు రైతులందరూ సహకరించాలన్నారు. పట్టా భూముల సరిహద్దుల మేరకు సర్వే నిర్వహిస్తారన్నారు. అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదులు చేయాలన్నారు. సొరకాయల పాళెం రెవెన్యూలెక 372 ఎకరాలకు గాను 183 ఎకరాలకు రీసర్వే నిర్వహించినట్లు తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు



భాకరాపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య కోరారు. చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం బీసీ అభ్యర్థులకు బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. భాకరాపేట సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలో 34 మంది, కెనరా బ్యాంకు పరిధలో 11 మంది, చిన్నగొట్టిగల్లు యూనియన్ బ్యాంకు పరిధిలో 49 మంది, సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలో 11 మందికి ఇంటర్వ్యూలు జరిగాయి. ఈవోపీఆర్ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూత విచ్చుకుంటే మందు పిచికారీ చేయొద్దు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మామిడిపూత విచ్చుకుని ఉన్నందున మందులు పిచికారీ చేయవద్దని ఉద్యానశాఖాధికారి సునీల్ కోరారు. అనుపల్లి, నెత్తకుప్పం మామిడితోటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పదిరోజుల తరువాత పిందెదశలో బుప్రోఫెజిన్, అసిఫాట్ కలిసి స్ప్రే చేయాలని సూచించారు. ప్రస్తుతం తేనె మంచు పురుగు కనిపిస్తోందన్నారు. ఒడిస్ 1 గ్రాము, శాఫ్ 1 గ్రాము, బంకమందు 0.5ఎంఎల్, లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

సంక్షేమ పథకాల సద్వినియోగంతో ఆసరా



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధారెడ్డి

పాకాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మహిళలు సద్వినియోగం చేసుకొని కుటుంబాలకు ఆర్థిక చేయూత నివ్వాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. శుక్రవారం ఓబులశెట్టివారిపల్లె, మద్దినాయనిపల్లె కొత్తవడ్డిపల్లె, గానుగపెంట పంచాయతీల్లో మహిళలతో ఆమె ముఖాముఖి నిర్వహించారు. గ్రామాలలో సమస్యలను అడిగి తెలుసుకొని సంక్షేమ పథకాలు గురించి వివరించారు. రాయితీ రుణాలు పొంది స్వయం ఉపాదితో ఎదగాలనికోరారు. జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నాగరాజనాయుడు, కార్యదర్శి ఫల్గుణ, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి, కె.సావిత్రి, చాముండేశ్వరి, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళలోనూ విశిష్ట గుర్తింపుకార్డు నమోదు



వృద్ధురాలు నాగమ్మ వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ విశిష్ట గుర్తింపుకార్డుతోనే సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా వ్యవసాయాశాఖాధికారి ప్రసాదరావు అన్నారు.ఎన్ఆర్‌కమ్మపల్లిలో జరుగుతున్న కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. మంచానికే పరిమితమైన లెక్కల నాగమ్మ ఇంటికి వ్యవసాయశాఖ అధికారులు వెళ్లి రిజిస్ట్రేషన్ చేశారు. డీపీఎం షణ్ముగం పాల్గొన్నారు. రాత్రి పూట కూడా నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నారు.

క్లినికల్ ట్రయల్స్‌తో జీవన నాణ్యత మెరుగు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): క్లినికల్ ట్రయల్స్ ద్వారా దీర్ఘకాలిక అనారోగ్య బాధితుల జీవన నాణ్యతను మెరుగుపరచుకోవచ్చని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫార్మశీ విభాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.కవిత అన్నారు. వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మశీ కళాశాలలో శుక్రవారం జాతీయ కాన్ఫరెన్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్లినికల్ ట్రయల్స్ అభివృద్ధి సవాళ్ల గురించి డాక్టర్ .కవిత వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌నిరంజన్ బాబు, పలు కళాశాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

తిరుమలలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



తిరుమల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం ఓ వృద్ధురాలు మృతి చెందింది. సుమారు 65 ఏళ్ల వయసున్న ఈమె ఏటీసీ2 ముందున్న మండపంలో మృతి చెందింది. మృతదేహాన్ని అశ్విని ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వద్ద అశ్విని ఆస్పత్రి ఓపీ చీటిని పోలీసులు గుర్తించారు. దీనిపై పద్మ అని రాసి ఉంది. మిగిలిన వివరాలేవీ లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 0877 2289031 నంబరుకు తెలియజేయాలని టూటౌన్ పోలీసులు కోరారు.

శ్రీవారిమెట్టు మార్గంలో భక్తుడికి అస్వస్థత

చంద్రగిరి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి మెట్టు మార్గంలో నల్గొండకు చెందిన భక్తుడు జైపాల్ అస్వస్థతకు గురయ్యాడు. శుక్రవారం 1150వ మెట్టు వద్ద ఇతడు మూర్ఛ వ్యాధితో రావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సకాలంలో టీటీడీ విజిలెన్స్, మెడికల్ సిబ్బంది శ్రీవారిమెట్టు కింది భాగానికి తీసుకొచ్చి 108 అంబులెన్స్ ద్వారా స్విమ్స్‌కు తరలించారు. తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్న క్రమంలో సకాలంలో ఆసుపత్రికి తరలించేలా టీటీడీ తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కేసు కొట్టివేతతో ధర్మం గెలిచింది

● బీజేపీ నేత నవీన్‌కుమార్

తిరుమల, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో ఉద్యోగి బాలాజీ సింగ్‌తో వ్యహరించిన తీరుకు బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ పశ్చాత్తాపాన్ని ప్రకటించడం శుభపరిణామమని బీజేపీ నేత నవీన్‌కుమార్ రెడ్డి స్వాగతించారు. భేషజాలకు పోకుండా ఉద్యోగస్తునితో కరచాలనం చేయడం సంతోషకరమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి అక్రమంగా తనపై పెట్టిన రెండవ కేసును హైకోర్టు రద్దు చేయడాన్ని ఆయన హర్షించారు . చెంపపెట్టు లాంటి తీర్పుతో ధర్మమే గెలిచిందని నవీన్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. టీటీడీలో కొన్ని సందర్భాల్లో తెలిసో తెలియక జరిగే తప్పిదాలను టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళితే సానుకూలంగా స్పందించాల్సిన గత పాలకులు అహంకారంతో అక్రమ కేసులు పెట్టి నామ రూపాలు లేకుండా పోయారన్నారు.

కరాటే పోటీల్లో నీలేష్ ప్రతిభ

తిరుపతి రూరల్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): చిగురువాడకు చెందిన ఆరో తరగతి విద్యార్థి కురకాల్వ నీలేష్ గుంటూరులో షిటోరియో కరాటే పోటీల్లో అత్యుత్తమంగా రాణించాడు. నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించాడు. ఇంటర్‌స్టేట్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ కట్టా విభాగంలో (2024) ప్రథమస్థానం, కుమితే విభాగంలో ద్వితీయస్థానం పొందినట్లు బాలుడి తల్లిదండ్రులు తెలిపారు. షిటోరియో కరాటే పోటీలలో 2023, 2024లో పలు పతకాలను సాధించారు. బాలుడి శిక్షకుడు మాస్టర్ అనిల్‌ని గ్రామస్తులు అభినందించారు.

వేడుకగా తిరువీధి ఉత్సవం

తిరుచానూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):పద్మావతి అమ్మవారికి శుక్రవారం రాత్రి ఘనంగా తిరువీధి ఉత్సవం జరిగింది. ఉదయం అభిషేకానంతరం ఉత్సవర్లకు కల్యాణోత్సవం జరిగింది. మధ్యాహ్నం తిరుమంజనం నిర్వహించారు. అమ్మవారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, అర్చకుడు బాబుస్వామి, ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్‌నాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

పాకాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తురకపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఖాదర్‌బాషాను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ నెలలో రిటైర వుతున్న ఆయనను ఎంఈవో బాబ్జీ, పాఠశాల కమిటీ సభ్యులు, సహ ఉపాధ్యాయులు సత్కరించారు. ఆయన విద్యాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జార్జ్, యువరాజ్, చెంగల్రాయులు, అన్సర్ బాషా, కేశవరావ్, సాబీరాబేగం, సీఆర్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమగ్రతా శిబిరానికి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కన్యాకుమారిలో ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ సమగ్రతా శిబిరానికి ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఎన్ఎస్ఎస్ అధికారులు దామోదరం, పాకనాటి హరికృష్ణ, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, ఎన్ఎస్ఎస్ అధికారులు విద్యావతి, యువశ్రీ అభినందించారు.

శివరాత్రి వేడుకల్లో భాగస్వాములు కండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మూర్తి తదితరులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో ఉన్న స్థలంలో ఈ నెల 26న మహాశివరాత్రి ఉత్సవాలు చేపడుతున్నట్లు రాజరాజరాజేశ్వరి జ్ఞాన పీఠం పీఠాధిపతి మూర్తి తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల ప్రారంభం

● పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాని, డాలర్స్ దివాకర్‌రెడ్డి



పోటీల ప్రారంభంలో సరదాగా బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏపీ టెన్నిస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి సీనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యారు. మూడు రోజులపాటు జిగే పోటీల్లో 8 మహిళల జట్లు , 16 పురుషుల జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ చంద్రగిరిని క్రీడల హబ్‌గా అభివృద్ధి చేయటానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. పోటీల సందర్భంగా నాని సరదాగా బ్యాటింగ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ ఛైర్మన్ పడిగల సురేష్ బాబు, ఎడిపై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్, రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రంభ ప్రసాద్, ఏపీ ఫ్లోర్ బాల్ సెక్రటరీ కే.జే జోసెఫ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించండి:ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించకపోతే చర్యలు తప్పవని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పోలీసులను హెచ్చరించారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రాత్రి గస్తీని పెంచాలని,పాత నేరస్తులపై నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కొందరు ఫిర్యాదుదాలతో ఆయన మాట్లాడారు.

సఫాయి కర్మచారీల సేవలు అమూల్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సఫాయి కర్మచారీల సేవలు అమూల్యమైనవని, వారిని గౌరవప్రదంగా చూడాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మాన్యువల్ స్కావెంజర్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సఫాయి కర్మచారీలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు రుణాలందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారి పిల్లలకు స్కాలర్‌షిప్పులు, మాన్యువల్ స్కావెంజర్లకు కనీస వేతనాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూనిఫాం, మహిళలు దుస్తులు మార్చుకునే సదుపాయాలు కల్పించాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

గ్యాస్ నిర్ణీత ధర మాత్రమే వసూలు చేయాలి: జేసీ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే సమయంలో వినియోగదారుల నుంచి బిల్లు ధర మాత్రమే వసూలు చేయాలని, ఎక్కువ తీసుకుంటే చర్యలు ఉంటాయని గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ హెచ్చరించారు. ఉచిత గ్యాస్ సిలిండర్(దీపం2)పై కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న డెలివరీ బాయ్‌లు సిలిండర్ ఇచ్చే సమయంలో బిల్లు ధరకన్నా ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులు వస్తే ఏజెన్సీ లైసెన్సు రద్దు చేయడమేగాక క్రిమినల్ కేసులు బనాయిస్తామన్నారు. కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా పౌరసరఫరాల అధికారి శేషాచలం రాజు, ఏఎస్‌వో జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నేతలకు పరామర్శ

చంద్రగిరి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తన సోదరుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలతో కలిసి శుక్రవారం పలువురును పరామర్శించారు. చంద్రగిరిలో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వైసీపీ నేతలు పసల నాగరాజు నర్లా నజరత్‌లను పరామర్శించారు. శ్రీనివాసమంగాపురంలో ఇటీవల మృతి చెందిన మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫొటో మార్ఫింగ్ పోస్టులపై కేసు నమోదు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి ఎక్స్ వేదికగా పోస్టు చేశారంటూ 36వ డివిజన్ జనసేన నేత వినోద్ రాయల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి పోస్టు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని వెస్ట్ పోలీసులు తెలిపారు.

ఫ్లెక్సీల చించివేతపై టీడీపీ ఆగ్రహం

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్సీ మునికృష్ణ ఫ్లెక్సీలను నగరంలో పలువురు గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారంటూ వైసీపీ నేతలపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మునికృష్ణ విజయాన్ని జీర్ణించుకోలేక ఇటువంటి చిల్లర పనులకు పాల్పడుతున్నారన్నారు. దీనికి తగిన ప్రతిఫలం తప్పదని హెచ్చరించారు. పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అలిపిరి పోలీసు స్టేషన్‌లో రూపేష్, వెస్ట్ పోలీసు స్టేషన్‌లో సుబ్బయాదవ్‌లు ఫిర్యాదు చేశారు.

ఆకట్టుకున్న సుద్దాల 'శ్రమ కావ్య గానం'




మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాయీ సలాకా ఇసుకా ఇటుకా తాపీ తట్టా.. గోడ మీదా గోడ.. మేడ మీద మేడ అంటూ సాగిన సుద్దాల అశోక్‌తేజ శ్రమ కావ్య గానం ఆద్యంతమూ ఆకట్టుకుంది. తిరుపతి యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం అశోక్‌తేజ శ్రమ కావ్య గానం నిర్వహించారు. కొమ్మా ఉయ్యాలా.. కోనా జంపాలా.. అంటూ జోలపాటతో తన గానాన్ని ఆరంభించారు. ' ఆంధ్రప్రదేశ్ విడిపోయివచ్చు - ఆలే విడిపోలేదు, అధికారం మారవచ్చు - తెలుగు నుడికారం మారదు, మమకారంలో తేడా లేదు అంటూ ఆహూతులను ఆకట్టుకున్నారు. టప టప టప టప టప చెమట బొట్లు తాలాలై పడుతుంటే, కరిగి కండరాల నరాలే స్వరాలు కడుతుంటే, పాట పనితో పాటే పుట్టిందీ.. పనీ పాటతోనే జత కట్టిందంటూ శ్రమ సౌందర్యాన్ని పాటలో పలికించారు. కొమురం భీముడో.. కొమురం భీముడో.. కొర్రాసు నెగడోలే మండాలి కొడుకో.. మండాలీ కొడుకా! అంటూ పాడారు. ఇలా మానవ జీవన పరిణామ క్రమంలో శ్రమ ప్రాముఖ్యతను గుర్తు చేశారు. 2016లో శ్రమ కావ్యం రాశానన్నారు. ఇప్పటికే 58 చోట్ల శ్రమ కావ్య గానం చేశాననీ, వంద లక్ష్యాన్ని నిర్దేశించు న్నట్టు తెలిపారు. ఇంటర్ చదివే రోజుల్లో ప్రతి శని, ఆదివారాల్లో భవన నిర్మాణ పనులకు వెళ్ళి, వచ్చిన డబ్బుతో చదువుకోవడంతో శ్రమ విలువ తెలుసన్నారు. జగతి మూలం శ్రమ అయితే, శ్రమకు మూలం అంబానీ, ఆదానీ అని మన పాలకులు అనుకుంటున్నారని విమర్శించారు. విజన్-2020, విజన్-2047లో శ్రమ ప్రస్తావన లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

శ్రమ కావ్య గానం గొప్ప విషయం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ.. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంతో పాటు, కమ్యూనిస్టు ప్రణాళిక గ్రంథం విడుదలైన రోజున శ్రమ కావ్య గానం చేయడం గొప్ప విషయమన్నారు. మల్లారపు నాగార్జున అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సుద్దాల అశోక్‌తేజ సహచరి నిర్మల, వేమన విజ్ఞాన కేంద్రం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం, పలువురు సంగీత, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ఆర్థిక, సామాజిక భద్రతే వీఎంసీ లక్ష్యం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారంతో పాటు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడమే జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ(వీఎంసీ) ముఖ్య లక్ష్యమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వీఎంసీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం, వారికి భరోసా కల్పించేలా ప్రభుత్వ పథకాలను అందిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో అంబేడ్కర్ భవన ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనప్పుడు నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, శిక్ష పడే విధంగా కృషి చేస్తామన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలు, కక్షతో తప్పుడు కేసులు బనాయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సభ్యులు మాట్లాడుతూ బ్యాంకుల్లో ఎస్సీ, ఎస్టీలకు వ్యక్తిగత రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని, పొలాలకు దారులు కల్పించాలని, గూడూరు గాంధీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

చేతిబోరుకు మరమ్మతులు


బోరు నుంచి నీటిని తోడుతున్న సిబ్బంది

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లిలో పాడైన చేతిబోరుకు మరమ్మతులు చేశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'కమిషనర్ గారూ.. తాగునీటి సమస్య పరిష్కరించరూ' అన్న శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నగర కమిషనర్ మౌర్య వెంటనే బోరుకు మరమ్మతులు చేయాలని సంబంధిత విభాగాన్ని ఆదేశించారు. ఆ మేరకు వారు మరమ్మతులు చేపట్టడంతో ప్రజలు సంతోషపడ్డారు.

ఎట్టకేలకు బస్సు షెల్టర్ తొలగింపు



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కరకంబాడి ప్రధాన రహదారిలో కూలేందుకు సిద్ధంగా ఉన్న బస్సు షెల్టర్‌ను ఎట్టకేలకు తొలగించారు. పాతికేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ షెల్టర్ శిథిలావస్థకు చేరుకుంది. అడుగు భాగం తుప్పుపట్టి ఒరిగిపోయి ఉండడంతో వాహన చోదకులు, ప్రజలు ఆందోళనకు గురయ్యేవారు. సమాచారం అందుకున్న సంబంధిత విభాగం అధికారులు నాలుగు రోజుల క్రితం తొలగించారు.

పాలియేటివ్ కేర్‌తో క్యాన్సర్ బాధితులకు ఉపశమనం


సమావేశంలో మాట్లాడుతున్న శామ్యూల్ సంజయ్ మురళి

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జీవనశైలిలో ప్రతి తొమ్మిది మందిలో ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్నారని, వారు ఆయువు ఉన్నంత వరకు జీవితాన్ని ఆనందమయంగా గడపడం కోసం ఏర్పాటు చేసే ప్రక్రియనే పాలియేటివ్ కేర్ అంటారని అమెరికాకు చెందిన ఇంటర్వెన్షనల్ పెయిన్ మెడిసిన్ వైద్యుడు శామ్యూల్ సంజయ్ మురళి పేర్కొన్నారు. స్విమ్స్‌లో శుక్రవారం నిర్వహించిన పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్ వింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్యాన్సర్ బాధితులకు ఇంటర్వెన్షనల్ పెయిన్ మేనేజ్మెంట్ చాలా ముఖ్యమైన భాగమని, రోగ నిర్ధారణ సమయం నుంచి నొప్పిని తగ్గించే వరకు ఉత్తమ ఫలితాలను అందించడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం క్యాన్సర్ కారకాలు, దాని నివారణ మార్గాలు, పాలియేటివ్ కేర్ పనితీరు గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య విభాగాధిపతులు సుబ్రమణియన్, నాగరాజ్, ఉషాకళావత్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

'టీటీడీ బోర్డు సభ్యుడిని నిందించడం తగదు'

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ కులానికి చెందిన టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌ను ఉద్యోగులు నిందించడం, నిరసనలకు దిగడం తగదని జనసేన నేత, నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవులపాటి బుజ్జిబాబు పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎంతో నిష్ఠతో భక్తులకు సేవ చేస్తున్న బోర్డు సభ్యుడితో టీటీడీ ఉద్యోగి అవగాహన రాహిత్యంగా వ్యవహరించడం సబబుగా లేదన్నారు. శ్రీవారి కల్యాణకట్ట మహిళా క్షురకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధాదేవి మాట్లాడుతూ చీర్ల కిరణ్ టీటీడీ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడి పేరుతో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కనుసన్నల్లో పనిచేస్తున్నా రన్నారు. ఉద్యోగులను రెచ్చగొట్టి నిరసన కార్యక్రమాలు చేపట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వడ్డెర సంఘం అధ్యక్షుడికి సన్మానం


మురళిని సన్మానిస్తున్న వడ్డెరల సంఘం జిల్లా నేతలు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన దేవళ్ల మురళిని జిల్లా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ముత్యాలమ్మగుడి ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే తమ కులస్తులకు న్యాయం జరుగుతుందన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు వడ్డెరల సంక్షేమానికి కృషి చేశారని కొనియాడారు. వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా జరపాలని జీవో విడుదల చేయడం అభినందనీయమన్నారు. వడ్డెరల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నేతలు దేవల శ్రీనివాసులు, మదనమోహన్, సాంబశివయ్య, వేముల నాగరాజు, తన్నీరు శ్రీనివాసులు, చంగల్, వాసుబాబు, జ్యోతి, బాలు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ మునికృష్ణకు సన్మానం



తిరుపతి (లీలామహల్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఆర్‌సీ మునికృష్ణ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో తుడా మాజీ చైర్మన్ ఎన్వీ ప్రసాద్, టీటీడీ మాజీ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, కార్పొరేటర్లు కుడితి సుబ్రహ్మణ్యం, అన్నా అనిత, రేవతి, శైలజ, కల్పనలు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు.

వెటర్నరీ విద్యార్థుల సమ్మెకు మద్దతు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారమూ కొనసాగింది. ప్రధాన గేటు ఎదురుగా దీక్షా శిబిరంలో బైఠాయించిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ నాయకులు బండి చలపతి, ఉదయ్, నేషనల్ లా స్టూడెంట్స్ సంఘ నాయకుడు సుధీర్ తదితరులు సంఘీభావం తెలిపి, మద్దతు ప్రకటించారు. విద్యార్థులు మాట్లాడుతూ 13 ఏళ్లుగా తమకు స్టైఫండ్ పెంచకుండా వివక్ష చూపుతున్నారని, పాలకులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు సదరన్ డిస్కం ఫైనాన్స్ డైరెక్టర్ వై.లక్ష్మీనరసయ్యను ఆలయాధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ రాజీవ్‌నగర్ సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీవీ నగర్, మునిరెడ్డి నగర్, పద్మావతి హాస్టల్, గాయత్రినగర్, శ్రీకృష్ణనగర్, గాంధీపురం, శ్రీరాజాకాలనీ, పద్మావతి కళాశాల, మహిళా విశ్వవిద్యాలయం సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

రేపు విశ్వంలో సైనిక్ మోడల్ టెస్ట్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో ఈనెల 23వ తేదీన సైనిక్ స్కూల్ మోడల్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6, 9 తరగతుల్లో ప్రవేశానికిగాను ఏప్రిల్ 5వ తేదీన జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష జరుగనున్న నేపథ్యంలో విద్యార్థుల ఉపయోగార్థం నమూనా పరీక్షను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 10గంటలకు అవగాహనా సదస్సు ఉంటుందని, తర్వాత పరీక్ష ఉంటుందని వెల్లడించారు.వివరాలకు 8688888802/9399976999లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

టైం ఆఫ్ డే విధానాన్ని రద్దు చేయాలి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఆర్‌సీ చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ ప్రకటించిన విద్యుత్ చార్జీల టారిఫ్‌లో టైం ఆఫ్ డే విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నేత కందారపు మురళి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచిందని తెలిపారు. 2025-26 వార్షిక ఏడాదికి డిస్కం కంపెనీలు ఇచ్చిన ప్రతిపాదనలను విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ అంగీకరించడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటివరకు పరిశ్రమలకు అమలుచేసిన టైం ఆఫ్ డే విధానాన్ని ఈ ఏడాది నుంచి సాధారణ వినియోగదారులకూ అమలు చేయాలని నిర్ణయించడం అన్యాయమని తెలిపారు. రద్దు చేయకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

మాతృభాషలో బోధన ఉత్తమం


ర్యాలీలో పాల్గొన్న తెలుగు విద్యార్థులు, అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాషలో బోధన సాగించడం అన్ని రకాలుగా ఉత్తమమని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సావేరి సమావేశ మందిరంలో నిర్వహించిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. బోధన మాతృభాషలో సాగితే విద్యార్థులకు విషయం స్పష్టంగా బోధ పడుతుందని అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని పలు అధ్యయనాలు కూడా శాస్త్రీయంగా నిరూపించాయని తెలిపారు. డీన్ ఆచార్య సి.వాణి మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాచార శాఖ ఏడీజీ రాజేందర్‌చౌదరి మాట్లాడుతూ తెలుగులో ప్రావీణ్యం ఉన్న వారికి అనువాద రంగంలో అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకు ముందు సభా ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ క్షేత్ర ప్రచారాధికారి శ్రీరామమూర్తి, అధ్యాపకులు డాక్టర్ డి.యువశ్రీ, డాక్టర్ వై.సుభాషిణి పాల్గొన్నారు.

పాఠశాలల్లో..

తిరుపతి (విద్య): అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని విద్యాసంస్థల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారతీయ విద్యాభవన్‌లో సంచాలకులు, కోశాధికారి డాక్టర్ నడింపల్లి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. తెలుగు భాషా భారతి జ్ఞాన పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. లిటిల్ స్టార్స్ హైస్కూల్లో కరస్పాండెంట్ పసుపులేటి ప్రసూన ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరిస్తూ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ బొంతల రాజేష్ పాల్గొన్నారు.

మాతృభాషతో మనోవికాసం

మాతృభాషలో విద్యా బోధన ద్వారానే విద్యార్థుల్లో మానసిక వికాసం కలుగుతుందని విశ్రాంతాచార్యు లు నాగోల కృష్ణారెడ్డి పేర్కొ న్నారు. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం అంత ర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వృత్తి, ఉద్యోగాలు, జీవనం నిమిత్తం పర భాషల్లో ప్రావీణ్యం సాధించాలని, అయితే మన భాష, సంస్కృతీ సంప్రదాయాలను మాత్రం విస్మరిం చరాదని సూచించారు. కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్ మాట్లాడుతూ మాతృభాషను గౌరవించి ఆచరిస్తే ప్రపంచ భాషల్లో సులభంగా ప్రావీణ్యం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ లైబ్రేరియన్ నటరాజనాయుడు, ఆంగ్లభాష అధ్యాపకులు లావణ్య, అపర్ణ, సందీప్ పాల్గొన్నారు.

జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు కృషి

తిరుపతి(గాంధీరోడ్డు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హేమాద్రియాదవ్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రైవేటు కళాశాలలను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోతున్నారని తెలిపారు.

దోబీఘాట్ సమస్యలు పరిష్కరించండి

తిరుపతి (జీవకోన), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జీవకోన పరిధిలోని జీవలింగేశ్వర రజక సహకార సంఘం దోబీఘాట్లలో సమస్యలను పరిష్కరించాలని అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దోబీఘాట్‌కు ప్రహరీ, ఇస్త్రీ చేసుకోవడానికి షెడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ మధు, కరాటే చంద్ర, రజక సంఘం నాయకులు మునస్వామి, శ్రీనివాసులు, అక్కినపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

వ్యాధులను ముందుగా గుర్తిస్తే మంచి ఫలితాలు


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శిశువు తల్లి కడుపులో ఉన్నప్పుడే వారిలోని వ్యాధులను గుర్తించి తగిన వైద్యం అందించి ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దడమనేది గొప్ప విషయమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. రుయాస్పత్రి చిన్నపిల్లల విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రా(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)న్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా పురిటి బిడ్డలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందుతాయన్నారు. శిశు మరణాలు తగ్గడంతోపాటు పుట్టే చిన్నారుల్లో అంగవైకల్యాన్ని పూర్తిగా నివారించేందుకు దోహదపడుతుందన్నారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఈ కేంద్రంలో చిన్నారులకుముందస్తు వైద్యసేవలతోపాటు అంగన్‌వాడీ సీడీపీవోలకు, ఏఎన్ఎంలకు శిశు సంరక్షణపై ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం నవజాత శిశు సురక్ష కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాల కృష్ణ నాయక్,నోడల్‌అధికారి ప్రశాంత్, వైద్యాధికారి ప్రదీప్, రాజన్‌శుక్ల పాల్గొన్నారు.

చిన్నారి శస్త్ర చికిత్సకు ఆర్థికసాయం


దీప్తి తండ్రికి నగదు సాయం అందజేస్తున్న సహచరులు - ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటో కార్మికులు

తిరుపతి(వైద్యం)/ఎమ్మార్‌పల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జీవకోనకు చెందిన ఆటోడ్రైవర్ మనోజ్‌కుమార్ కుమార్తె దీప్తిమాధురి(13) గుండె సంబంధిత సమస్యతో కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పేద కుటుంబం కావడంతో రుయా శ్రీవేంకటేశ్వర అంబులెన్స్ సర్వీసెస్ అసోసియేషన్ రూ.35 వేలు, రైల్వేస్టేషన్ సమీపంలోని సుదర్శన్ ఆటోస్టాండ్ వారు రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. బాలిక తండ్రి మనోజ్‌కుమార్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ దీప్తికి పుట్టుకతోనే గుండె సమస్యలు ఉన్నాయని తెలిపారు. గుండెలో రంధ్రాలు ఉండడంతో ఉన్న ఆస్తులు అమ్మి అపరేషన్ చేయించినట్లు తెలిపారు. పల్మనరీ వాల్వ్ ఇంప్లాంటేషన్ కోసం రూ.18లక్షలు అవసరమవుతుందని వైద్యులు తెలిపారని, దాతలు సాయం చేయాలని కోరారు. సాయం చేయదలచిన వారు 8977765058కు ఫోన్ పే చేయాలని కోరారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హామీలను అమలు చేయండి


యూనియన్ బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది మార్చిలో ఐబీఏ ఉద్యోగ సంఘాల నాయకులతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యూఎఫ్‌బీయూ నాయకులు పి.విజయ భాస్కర్, జె.ధన్వంత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుచానూరు మార్గంలోని రామానుజం సర్కిల్ సమీపంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ సమస్యలను 15 రోజుల్లో పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ నేటివరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. జాతీయ బ్యాంకుల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని కోరారు. పాత పింఛను విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ బ్యాంకుల్లో అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జనార్దన్, భాస్కర్, కేశవరెడ్డి, సుమలత, రేష్మా, నిర్మల, వెంకటలక్ష్మి, మహేష్, యప్నేష్ బాబు, నందకుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ ఆధ్వర్యంలో

తిరుపతి (కపిలతీర్థం): బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల ఉద్యోగులు శుక్రవారం మున్సిపల్ రోడ్డులోని ఎస్‌బీఐ శాఖ ముందు నిరసన తెలిపారు. యూఎఫ్‌బీయూ తిరుపతి కన్వీనర్ కేవీఎస్ఎన్.మూర్తి, తిరుపతి ఎస్‌బీఐ ఆఫీసర్స్ చీఫ్ రీజనల్ సెక్రటరీ వెంకటపతి మాట్లాడుతూ ఖాళీలు భర్తీ చేయాలని, ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని కోరారు.

రుయాస్పత్రిలో గుర్తు తెలియని మృతదేహాలు




తిరుపతి (వైద్యం), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రి ఆవరణలో గుర్తు తెలియని పురుషుడు, మహిళ మృతదేహాలను గుర్తించి, మార్చురీకి తరలించినట్లు వెస్ట్ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో 55 ఏళ్ల వ్యక్తి, బ్లడ్‌బ్యాంక్ వెనుక 35 ఏళ్ల వయస్సు కలిగిన మహిళ మృతిచెంది ఉన్నట్లు గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించగా మృతదేహాల వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదు. గుర్తు తెలియని మృతదేహాలుగా కేసు నమోదు చేసి మార్చురీకి తరలించారు. వివరాలు ఎవరికైనా తెలిస్తే వెస్ట్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని పేరూరుకు సమీపంలో గరుడ ఎన్‌క్లేవ్ ఎదురుగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. తిరుపతి నుంచి హాస్టల్‌కు నిత్యావసర సరుకులు తీసుకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న గంగాధర్, బాబులను మద్యం మత్తులో ఉన్న ఆటోడ్రైవర్ వేగంగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఆటో బోల్తా పడటంతో అందులో ఉన్న యశోదతో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. ఆ వ్యక్తిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో చైన్ చోరీ

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో చైన్ చోరీ చేసిన ఘటన తిరుపతి రూరల్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. సుమతి తన కుమార్తె యశోదతో కలిసి సాయంత్రం వాకింగ్ చేస్తున్నారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి యశోద మెడలోని 26 గ్రాముల బంగారు సరుడు లాక్కెళ్లారు. రూరల్ పోలీసులకు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల వలయంలో సీబీఎస్

మరమ్మతు పనుల్లో జాప్యం - అనుమతులు రాక చేతులెత్తేస్తున్న ఇంజనీరింగ్ విభాగం


సీబీఎస్‌లోని పల్లెవెలుగు బస్టాండు దుస్థితి


ఓపెన్‌గా ఉన్న డ్రైవర్ల విశ్రాంతి గది

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరపతి సెంట్రల్ బస్టాండు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. బస్టాండుతో పాటు జిల్లాలోని 11 డిపో గ్యారేజీలు, బస్టాండ్లలో మరమ్మతు పనులు చేపట్టేందుకు ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం పలు మార్లు ప్రతిపాదనలు పంపినా విజయవాడ ప్రధాన కార్యాలయ అధికారులు అనుమతులు ఇవ్వకుండా పక్కన పడేస్తున్నట్లు సమాచారం. దీంతో బస్టాండ్లలో సమస్యలు అంతకంతకు పేరుకుపోతున్నాయి. ప్రాంగణాలు గుల్లతేలిపోయాయి. సామూహిక మరుగుదొడ్లు, ప్లాట్‌ఫామ్స్ అధ్వానంగా తయారయ్యాయి. నీటి సరఫరా, విద్యుత్ వ్యవస్థలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. బస్టాండ్ల పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. ప్రహరీ గోడలు కూలిపోతున్నాయి. సౌకర్యాల కొరతతో కార్గో వ్యవస్థ సరిగా పనిచేయడం లేదు. పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దుకాణాలు మరమ్మతులకు గురవుతున్నాయి. సెంట్రల్ బస్టాండులో బస్సు పాసులు మంజూరు చేసే కేంద్రానికి ప్రమాదం పొంచివున్న మరొక ప్రదేశానికి తరలించలేని పరిస్థితి. చెన్నై ప్లాట్‌ఫామ్ వద్ద పాడైన మరుగుదొడ్లు మరమ్మతులకు నోచుకోలేదు. డ్రైవర్ల విశ్రాంతి గదికి గోడలు, తాగునీరు సౌకర్యం లేదు. శ్రీహరి బస్టాండు పూర్తిగా పెచ్చులూడుతోంది. సామూహిక మరుగుదొడ్లు పాడైపోవడంతో వెలుపలనే మలమూత్ర విసర్జన చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.




అధ్వానంగా సామూహిక టాయిలెట్ - ఏడుకొండల బస్టాండు నుంచి వెలుపలకు వచ్చేదారి



శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న ఇండియన్ బ్యాంక్ ఎండీ, సీఈవో బినోద్ కుమార్ - సంగీత దర్శకుడు తమన్ - గాయకులు అద్వితీయ, శృతి రంజని

శ్రీవారికి మినీ ట్రక్కు విరాళం

తిరుమల శ్రీవారికి శుక్రవారం అశోక్ లేలాండ్ కంపెనీ బిజినెస్ హెడ్ విప్లవ్ షా రూ.6.60 లక్షల విలువైన సాథీ మినీ ట్రక్కును విరాళంగా అందజేశారు. శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించాక వాహన పత్రాలు, తాళాలను ఆలయ ఏఈవో మోహన్‌రాజుకు అందించారు. ఈ కార్యక్రమంలో అశోక్ లేలాండ్ సేల్స్ హెడ్ శ్రీకాంత్ రాజ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వాహన తాళాలను ఏఈవోకు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 23 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.24 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,776

తలనీలాలు సమర్పించినవారు: 22,386





హేమవతి - హేమలత



చరణశ్రీ, చరణ్యశ్రీ

దీక్షిత, దర్శిల్ (హైదరాబాదు)

హితీష్, హిమ్నేష్

ఒకే పోలికతో ఉన్న ఇద్దరిని చూడగానే ముచ్చటేస్తుంది. అలాంటిది దాదాపుగా 70మంది కవలలు ఒకే వేదికపై కలుస్తున్నారంటే ఇంతకంటే ఆనందమేముంటుంది. జాతీయ కవలల దినోత్సవం పురస్కరించుకుని శనివారం వీరందరి సెలబ్రేషన్స్‌కు నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రం వేదిక కానుంది. ఉదయం 10గంటలకు కేక్‌కటింగ్‌తో కవలల సందడి మొదలవుతుంది. ర్యాంప్ వాక్, డ్యాన్స్, సింగింగ్ లాంటి వివిధ పోటీల్లో వీరంతా ఉత్సాహంగా పాల్గొంటున్నారు.. ప్రతిభ కనబరిచిన కవలలకు బహుమతులు కూడా ప్రదానం కూడా ఉంటుంది. కొన్నేళ్లుగా ఇలా వేడుక నిర్వహణకు బాధ్యత వహిస్తున్నారు నగరానికి చెందిన హేమావతి, హేమలతలు. వీరిద్దరూ కూడా కవలలేనండోయ్.. ఈ సందర్భంగా వారు ఆంధ్రజ్యోతితో కవలల కలయిక వెనుక ఉన్న ప్రయత్నాన్ని వివరించారిలా..

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

కవలలు.. కలుస్తున్నారిలా..



వీరేంద్ర, విజయేంద్ర (బద్వేల్)

- వేదిక కానున్న వేమన విజ్ఞానకేంద్రం
- నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం



హస్సేన్, హుస్సేన్ (పీలేరు)

తొలిసారి వేడుకలకు మేమిద్దరమే...

తిరుపతి రాయలచెరువురోడ్డు యాదవకాలనీ మా స్వస్థలం. నాన్న సహదేవ కారుడ్రైవర్, అమ్మ గృహిణి. 7వ తరగతిలో చదువుతుండగా కవలల దినోత్సవం రోజున ప్రేయర్‌లో 2వ తరగతి విద్యార్థులు రామ్‌లక్ష్మణ్‌లను పిలిచారు. టీచర్స్ శుభాకాంక్షలు తెలిపారు. తరువాత మాఇద్దరికీ కూడా శుభకాంక్షలు తెలిపారు. అప్పుడే తెలిసింది కవలలకు ప్రత్యేక రోజు ఉందని. వచ్చే ఏడాది నుంచి సంబరాలు చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాం. అమ్మానాన్నలకు చెబితే సరే అన్నారు. 2007లో తొలిసారిగా కవలల దినోత్సవాన్ని చేసుకున్నాం. అప్పుడు మాతో నాలుగు జంటల కవలలు కలిశారు. ఆ తరువాత ఏటా ట్విన్స్ రావడం పెరిగారు. 2018లో 50మందితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేశాం. కరోనా నేపథ్యంలో 2020, 2021లో వేడుకలు జరుపుకోలేదు. 2022, 2023, 2024లలో 70జంటలకు తగ్గకుండా కవలల దినోత్సవం జరుపుకొంటున్నాం. కుటుంబంలా ఏర్పడుతున్నాం. ఏటా మాతో పాటు మరో నలుగురు విరాళం అందిస్తున్నారు. ఎంబీఏ చదివిన మేము ప్రస్తుతం బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాం. వేడుక కోసం ఏటా రెండు రోజుల ముందుగా ఇంటికి వస్తాం. సంబరాలకు ఏర్పాట్లు చేస్తాం. తిరుపతిలో ఉంటున్న హితీష్, హిమ్నేష్, చరణశ్రీ, చరణ్యశ్రీ, తెలంగాణ గద్వాల్ నుంచి విజేంద్ర, వీరేంద్ర, పీలేరుకు చెందిన హస్సేన్, హుస్సేన్, హైదరాబాదుకు చెందిన దీక్షిత, దర్శిల్ కూడా ఆర్థిక సహకారమందిస్తున్నారు. ఈ ఏడాది శనివారం వేమనవిజ్ఞాన కేంద్రంలో సెలబ్రేషన్స్ చేసుకుంటున్నాం. తిరుపతి, చిత్తూరు, పుత్తూరు, రేణిగుంట, శ్రీకాళహస్తి, నగరి, కడప, మదనపల్లి, కర్నూల్, హైదరాబాద్, బెంగళూరు, గద్వాల్ నుంచి కూడా ట్విన్స్ వస్తున్నారు. సేవా కార్యక్రమాలు చేయాలన్నదే మా ఆకాంక్ష. రక్తదాన, అన్నదాన కార్యక్రమాలు విస్తృతంగా చేయాలి. పేద కవలలను ఆదుకోవాలి. వారి విద్య, వైద్యానికి చేయూత అందించాలనుకుంటున్నామని హేమావతి, హేమలత వివరించారు.



ప్రాచీన సంగమేశ్వర ఆలయం

స్వర్ణముఖి నదీ తీరాన వెలసిన సంగమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ఆరాదిస్తారు. తమ కోరికలు తీర్చే దైవంగా విశ్వసిస్తారు. కోట మండలం గూడలిలో చోళరాజులు నిర్మించిన స్వామి ఆలయానికి విశేష చరిత్ర ఉంది. ఎప్పటిలా ఈ ఏడాదీ మహాశివరాత్రి వేడుకలకు ఆలయం ముస్తాబవుతోంది.

- కోట, (ఆంధ్రజ్యోతి)

అటు సంగమయ్య.. ఇటు సోమయ్య

- గూడలి సంగమేశ్వరుడి ఆలయంలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

సంగమేశ్వరుడి ఆలయం వెనుక ఆసక్తికర ఇతిహాసముంది. ఆరవ శతాబ్దంలో అగస్త్య మహాముని కాశీ నుంచి కన్యాకుమారికి వెళ్తూ గూడలి వద్ద రాత్రిపూట బసచేశాడు. మర్నాడు ఉదయాన్నే స్వర్ణముఖినదిలో స్నానం చేస్తుండగా ప్రకృతి ప్రళయ గర్జన సృష్టించింది. వటవృక్షాలు సైతం నేలకొరిగిపోయాయి. స్నానానికి ముందు అగస్త్య మహాముని నరది ఒడ్డునపెట్టిన రుద్రాక్ష మాలలు చెక్కు చెదరలేదు. అంతేకాదు ఆ రుద్రాక్షమాలన్నీ శివలింగ ఆకృతిలో కొలువుదీరాయి.. దీంతో విస్తుపోయిన మహాముని ఈ ప్రాంతంలో సాక్షాత్తూ పరమేశ్వరుడే ఉన్నాడంటూ నాటి చోళరాజుల్లో పెద్దవాడైన పెదపాండ్యభూపతిరాజుకు చెబుతాడు. వెంటనే భూపతిరాజు గూడలిలో స్వర్ణముఖినది తీరానా కామాక్షిదేవి సమేత సంగమేశ్వరుని ఆలయాన్ని నిర్మించారనిఐతిహ్యం ప్రచారంలో ఉంది. చోళరాజుల హయాంలోని విలువైన భూములను మాన్యంగా ఇచ్చారు. అప్పటి నుంచి సంగమేశ్వరుడి ఈ ప్రాంతంలో భక్తుల పూజలందుకుంటున్నాడు.



గూడలిలో సంగమేశ్వరుడు విగ్రహం

దేవదాయశాఖ పరిధిలో...

సంగమేశ్వరుడి ఆలయం ఇప్పుడు దేవదాయశాఖ పరిధిలోకి ఉంది. 14 ఎకరాల మాన్యం భూముల కౌలుతో ఏటా శివరాత్రి ఉత్సవాలు, ఏప్రిల్ మొదటివారంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆలయంలో అన్నదానానికి ప్రత్యేక గదుల నిర్మించాలని ప్రతిపాదించారు. కోనేరుకు స్థలం లేనందున పక్కనే ఉన్న స్వర్ణముఖినదిలో భక్తుల స్నానాలు చేసి సంగమయ్యకు మొక్కులుతీర్చుకుంటారు. నాటి రథమే నేటికీ చెక్కుచెదరకుండా స్వామి సేవలో తరిస్తోంది. కామాక్షి దేవి అమ్మవారికి ఇటీవ వెండిచీరను అలంకరించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటకల నుంచి కూడా భక్తులు వస్తుంటారు.

ఎలా చేరుకోవాలంటే..

నాయుడుపేటకు చేరుకుని కోట-నాయుడుపేట మార్గం మీదుగా 25 కిలోమీటర్లలోని గూడలికి రావాలి. నెల్లూరు నుంచి గూడూరు నుంచి రావాలనుకుంటే విద్యానగర్‌కు చేరుకొని 1.5 కిలోమీటర్లు నడిచి గాని, వాహనాల్లో గూడలి చేరుకోవచ్చు.

చేరువలో భీమయ్య ఆలయం

సంగమేశ్వరుని ఆలయానికి కొన్ని మీటర్ల దూరంలోనే గూడలి తిప్ప ఉంది. ఈ తిప్పపై పర్వతవర్థిని సమేత భీమేశ్వర ఆలయముంది. ఈ ఆలయం కూడా 500 ఏళ్ల పైబడిన ఆలయంగా చెబుతుంటారు. తిప్పమీద భీమేశ్వరుడు, తిప్ప కింద సంగమేశ్వరుడు రెండు కళ్లతో తమను కాపాడుతారని ఇక్కడి తీర మండలాల ప్రజల నమ్మకం. ఈ రెండు ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



రేస్ కార్ ఆవిష్కరణలో తమన్ తదితరులు

అంబరం సాంకేతిక సంబరం

- ఐఐటీలో అట్టహాసంగా తిరుత్సవ్ ఆరంభం



వేదికపై మాట్లాడుతున్న తమన్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో తిరుత్సవ్-2025 అట్టహాసంగా ప్రారంభమైంది. టెక్నో కల్చరల్ ఫెస్ట్ తిరుత్సవ్ పేరుతో మూడు రోజులపాటు జరిగే ఈ వేడుక శుక్రవారం ప్రారంభమైంది. సాంకేతిక నైపుణ్యాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఐఐటీ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో, 3డీ లైట్లతో తీర్చిదిద్దారు. ముఖ్య అతిథిగా హాజరైన సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అంతకుముందు ఐఐటీ విద్యార్థుల ఆధ్వర్యంలో సాంకేతిక వర్క్‌షాప్‌లు, ఎగ్జిబిషన్ జరిగాయి. వినూత్న ఆవిష్కరణలపై చర్చించారు. సాంకేతిక అంశాలను పోటాపోటీగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై
కల్యాణ వెంకన్న కటాక్షం



కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై స్వామివారు



చంద్రగిరి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కల్పవృక్ష, రాత్రి సర్వభూపాల వాహనాలపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పూజల అనంతరం ఉత్సవర్లను రాజమన్నార్ అవతారంలో అలంకరించి కల్పవృక్ష వాహనంపై అధిష్ఠించారు. మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం కంకణ భట్టర్ నారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్నపన తిరుమంజనం(పవిత్రస్నానం), సాయంత్రం ఊంజల్‌సేవ జరిగింది. రాత్రి కాళియమర్దిని అలంకారంలో సర్వభూపాల వాహనంపై స్వామివారు తిరుమాడ వీధుల్లో ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునిమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, పార్థసారది, నారాయణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు. శనివారం రాత్రి గరుడ వాహనసేవ జరగనుంది.



లోకలైసర్ యాంటెన్నాలు

విమానాశ్రయంలో నూతనంగా అమర్చిన డిస్టాన్స్ మెజరింగ్ ఎక్విప్మెంట్ - విమానాశ్రయం రన్‌వేలో అమర్చిన గ్లైడ్ పాత్

తిరుపతి విమానాశ్రయానికి అధునాతన పరికరాలు

రేణిగుంట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో అంతర్జాతీయ స్థాయి విమానాలు ల్యాండింగ్ అయ్యేందుకు రూ.153.16 కోట్లతో అధునాతన పరికరాలను ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారని ఎయిర్ పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మానే తెలిపారు.

డిస్టెన్స్ మెజర్మెంట్ ఎక్విప్‌మెంట్: ప్రస్తుతమున్న రన్‌వేపై కేవలం 100విమానాలను ఆపరేటివ్ చేసే స్థాయి నుంచి200 విమానాల రాకపోకలను అధునాతన డిస్టెన్స్ మెజర్మెంట్ ఎక్విప్మెంట్‌ను తిరుపతి విమానాశ్రయంలో అమర్చారు. ఈ అధునాతన పరికరానికి రూ.5.61 కోట్లు వెచ్చించారు.

ఇన్‌స్టుమెంటల్ ల్యాండింగ్ సిస్టం(ఐఎల్ఎస్): గతంలో రన్‌వేపై 700 మీటర్ల కెపాసిటీ ఉన్న ఇన్‌స్ట్రుమెంటల్ ల్యాండింగ్ సిస్టం(ఐఎల్ఎస్)ను 1500 మీటర్లకు పెంచి అధునాతన పరికరాన్ని అమర్చారు. విమానాలు దిగే సమయంలో బ్యాలెన్స్ చేసుకుని రన్‌వే మధ్య గీతను గుర్తించి క్షేమంగా ల్యాండింగ్‌కు ఈ పరికరం సహకరిస్తుంది. వాతావరణం అనుకూలించని పరిస్థితుల్లోనూ ల్యాండింగ్‌కు సహకరిస్తుంది. ఈ పరికరం ధర రూ.4.4 కోట్లు.

బోయింగ్ విమానాల రాకపోకలకు సుగమం

రన్‌వేను 3810 మీటర్లతో విస్తరించడంతో బోయింగ్ 777, ఎయిర్ బస్ 330 వంటి పెద్దపెద్ద ఎయిర్‌క్రాఫ్ట్‌లు సురక్షితంగా ల్యాండింగ్ కావచ్చు. ప్రస్తుతం అమర్చిన లైటింగ్ కారణంగా రన్‌వేకు స్పష్టంగా కనిపిస్తుండడంతో క్షేమంగా ల్యాండయ్యేందుకు ఉపయోగపడుతుంది. ఈ రన్‌వే నిర్మాణానికి రూ.143.15కోట్లు వెచ్చించారు. వీటన్నింటినీ శుక్రవారం వర్చువల్ విధానంలో ఏఏఐ అధికారులు లాంఛనంగా ప్రారంభించారు.

'వైష్ణవి' డెయిరీ ఎదుట కార్మికుల ధర్నా



పెళ్లకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పెళకూడూరు మండలం పునబాక గ్రామంలో మూసేసిన శ్రీ వైష్ణవి డెయిరీ ఎదుట శుక్రవారం కార్మికులు ధర్నా చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీ వ్యవహారం నేపథ్యంలో ఈ వైష్ణవి పరిశ్రమ మూతపడింది. దీనిపై అధికారులు పలు దఫాలుగా ఈ పరిశ్రమలో తనిఖీలు చేశారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా కంపెనీని మూతవేసి ఆచూకీ లేకుండా వెళ్లారు. దీంతో కార్మికులు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కంపెనీని మూతవేశారని అయినా కొంతకాలం వేచి చూసి తమకు రావాల్సిన గ్రాట్యుటీతో పాటు ఇతర అలవెన్సులు ఇవ్వాలని కంపెనీ ఎదుట టెంటు వేసుకొని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కంపెనీకి సంబంధించిన ప్రతినిధులు ఆందోళన చేస్తున్న కార్మికుల వద్దకు చేరుకొని నెలరోజుల్లో కార్మికులకు అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణహత్య

- ఇసుకలో పూడ్చిపెట్టిన హంతకులు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తిని హతమార్చి ఇసుకలో పూడ్చిపెట్టిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలు... తొట్టంబేడు మండలం శివనాథపురం పరిధిలోని రాజీవ్‌నగర్‌లో పలు నిర్మాణాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. శుక్రవారం సుగుణ అనే మహిళ రాజీవ్‌నగర్‌లో ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఇసుక తగ్గింది. దీంతో సమీపంలోని అసంపూర్తిగా ఉన్న ఓ ఇంట్లో ఇసుకను తీసుకునేందుకు మరో మహిళను వెంటబెట్టుకుని వెళ్లింది. అక్కడ ఇంట్లో ఇసుకపై ఉన్న సిమెంటు ఇటుకలను పక్కకు తీయగానే మృతదేహం కాలు బయటపడింది. బిత్తర పోయిన వీరిద్దరూ తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ తిమ్మయ్య, ఎస్ఐ ఈశ్వరయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇసుకలోని మృతదేహాన్ని వెలికి తీశారు. సుమారు ఒకటిన్నర నెల క్రితం పూడ్చినట్లు అంచనా వేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి వైద్యబృందంతో ఘటనా స్థలంలో పోస్టుమార్టం పూర్తి చేశారు. మృతదేహం వెలుగు చూసిన ఇంటి స్థలం ఎవరిది అన్నది ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

పుత్తూరు వార్తలు

చెత్త నిర్వహణకు సరికొత్త ప్రణాళిక

- 78 కాంపాక్టర్ బిన్లు, 2 ఆటోలు, 2 ట్రాక్టర్ల కొనుగోలు



పుత్తూరుకు చేరిన కాంపాక్టర్ బిన్లు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలో చెత్త సమస్య తలెత్తకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇకపై ఎక్కడ పడితే అక్కడ చెత్త కనిపించకుండా కాంపాక్టర్ బిన్లు ఏర్పాటు చేయనున్నారు. పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉన్న నేపథ్యంలో యాంత్రీకరణకు చర్యలు చేపట్టారు.

కాంపాక్టర్ బిన్ల కొనుగోలు

పుత్తూరు పట్టణంలె రోజుకు 24 టన్నుల చెత్త ఉత్పన్నమవుతోంది. సేకరణలో తగిన వాహనాలు, సిబ్బంది లేకపోవడం సమస్యగా మారింది. దీంతో సాధారణ నిధులు రూ.10 లక్షలు వెచ్చించి 22 కాంపాక్టర్ బిన్లు కొనుగోలు చేశారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలు వెచ్చించారు. మరో 56 కాంపాక్టర్ బిన్లు పుత్తూరుకు చేరుకోనున్నాయి. అలాగే రెండు ఆటోలు, రెండు ట్రాక్టర్లు రానున్నాయి. వీటితో పాటు ప్రస్తుత వాహనాలతో పట్టణంలో మెరుగైన పారిశుధ్యానికి చర్యలు తీసుకోనున్నారు.

చెత్త సేకరణలో సరికొత్త ప్రణాళిక

పుత్తూరు పట్టణంలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ, ఇష్టానురీతిన వేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు రోడ్డు పక్కన చెత్త వేసే వారినుంచి అపరాధ రుసుం వసూలు చేయనున్నారు. పట్టణంలోని 350 ఇళ్ల చొప్పున 43 జోన్లుగా విభజించి చెత్తను సేకరించనున్నారు.

రైలు ఢీ కొని డిగ్రీ విద్యార్థి మృతి



బాలాజీ(ఫైల్)

పుత్తూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పుత్తూరు రైల్వే సమీపంలో గురువారం రాత్రి రైలు ఢీకొని డిగ్రీ విద్యార్థి బాలాజీ(21) మరణించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... చెన్నై కొల్లం ఎక్స్‌ప్రెస్ ఇంజిన్ డ్రైవర్ రైలు పట్టాల మీద నిలుచుకుని వున్న యువకుడిని గుర్తించి హారన్ కొట్టినా పక్కకు పోలేదని తెలిపారు. డ్రైవర్ ఫిర్యాదు ఆధారంగా మృతుడు ఆత్మహత్మకు పాల్పడినాడని భావించి ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. కేవీబీ పురం మండలం అంజూరు గ్రామానికి చెందిన బాలాజి స్థానిక ఓ ప్రైవేటు హాస్టల్‌లో వుంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్ చదువుకుంటున్నాడు. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్ష నిర్వహించారు. తమ కళాశాల విద్యార్థి ఆకస్మిక మరణం దురదృష్టకరమని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య అన్నారు.

శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



వడమాలపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భక్తులకు అసౌకర్యం కలుగకుండా మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే భానుప్రకాష్ చెప్పారు. శుక్రవారం తిరుపతిలోని ఆయన నివాసంలో సదాశివకోన శివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దట్టమైన అటవీ ప్రాంతంలోని సదాశివకోనకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తల్తెకుండా సులభతరంగా దర్శనం ఏర్పాట్లు చేయాలన్నారు. పుత్తూరు మార్గంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ప్రతినిధి ధనంజయులునాయుడు, శ్రీధర్‌రాజు, ఢిల్లీ ప్రసాద్, మంజుల, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణ మేళాకు స్పందన

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణ మేళాకు లబ్ధిదారులు పెద్ద ఎత్తున మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాలకు చేరుకున్నారు. బ్యాంకు అధికారులు లబ్ధిదారుల దరఖాస్తులను, వారి అర్హతల ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంలో 595 దరఖాస్తులు, ఎంపీడీవో కార్యాలయంలో 149 మంది ధృవీకరణ పత్రాలను బ్యాంకు అధికారులు పరిశీలించారని మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ, ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

వడమాలపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ స్పందించారు. కదిరిమంగళం బైపాస్ రోడ్డు వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి - చెన్నై జాతీయ రహదారిలో గురువారం రాత్రి లైట్లు లేకపోవడంతో కదిరిమంగళం రోడ్డు వద్ద తిరుపతి నుంచి బైక్‌పై వడమాలపేటకు వస్తూ రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి హర్ష అనే వ్యక్తి బైక్‌పై వేగంగా వస్తూ ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో సుధాకర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే భానుప్రకాష్ శుక్రవారం ఉదయం జాతీయ రహదారుల సంస్థ అధికారులపై మండిపడ్డారు. గతంలో తడుకు రైల్వేస్టేషన్, కదిరిమంగళం బైపాస్ రోడ్డుల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరిన స్పందించకపోవడంపై ప్రశ్నించారు. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో అధికారి భాస్కర్‌రాజు శుక్రవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు హైమాస్ట్ లైట్ల విద్యుత్ స్తంభానికి కనెక్షన్ ఇచ్చారు. దీంతో కదిరిమంగళలం గ్రామస్తులు, ప్రయాణీకులు ఆనందం వ్యక్తం చేశారు.

ముక్కంటి ఆలయానికి పట్టువస్త్రాల అందజేత



శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి చెన్నైకు చెందిన వ్యాపారి దొరై నాగరాజు ఉత్సవాల్లో స్వామి అమ్మవార్లకు అలంక రించేందుకు 13 పంచెలు, 26 చీరలు ఆలయానికి తన ప్రతినిధి నాగేంద్రరావు ద్వారా సమర్పించారు. ఈ మేరకు దాతలు ఆదివారం పరిపాలనా భవనంలో ఈవో బాపిరెడ్డికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఘన వీడ్కోలు



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 21(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. స్నేహితులతో గడిపిన క్షణాలను నెమర వేసుకున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ప్రిన్సిపాల్ తులసిజ్యోతి శుక్రవారం తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. దరఖాస్తు చేసుకోవడానికి డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలని ఆమె కోరారు.

దొరవారిసత్రం: మావిళ్లపాడు మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు మార్చి 31లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ సుమలత కోరారు. వివరాల కోసం పాఠశాలలో సంప్రదించవచ్చుని తెలియజేశారు.

మూడు చెరువుల్లో చేపల విడుదల



కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మూడు చెరువుల్లో శుక్రవారం మత్స్యశాఖ అధికారులు చేపలను విడుదల చేశారు. ముందుగా మద్దాలి చెరువులో 11,250 చేపపిల్లలు, కేశవరం చెరువులో 18,200, ఊనుగుంటపాళెం చెరువులో 5,070 చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు వదిలారు. సాగునీటి సంఘాల పర్యవేక్షణలో ఈ చేపపిల్లలను వదిలారు. ఎఫ్‌డీవో రెడ్యానాయక్ మత్స్యశాఖ అసిస్టెంట్ నాగరాజు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

తడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ తెలుగుభాషా దినోత్సవాన్ని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాములమిట్ట పాఠశాలలో హెచ్‌ఎం ఉస్మాన్‌బాషా, కాశింగాడుకుప్పం పాఠశాలలో హెచ్‌ఎం రఘురామయ్య, స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సురేష్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భావ వ్యక్తీకరణ మాతృభాషతోనే సాధ్యపడుతుందని ప్రముఖ కవి దాసరి చంద్రయ్య అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాలలో ఉపాధ్యాయులు చెంగయ్య, రమణమ్మ, వేమయ్య, మంజుల, కళ్యాణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

రూ.2 వేలతో 40 లక్షల ప్రమాద బీమా

తడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని ఎస్‌బీఐ మరింత విస్తరించిందని ఏటా రూ.2 వేలు చెల్లిస్తే 40 లక్షల ప్రమాద బీమాకు అవకాశం ఉంటుందని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రామాంజనేయులు తెలి పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి 70 వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ బీమాకు అర్హులని అన్నారు. వంద రూపా యలతో ఈ ప్రీమియం మొదలవుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, కరెంట్ షాక్‌లు, వరదలు, భూ కంపాలు, విషసర్పాల ప్రమాదబాధితులకు బీమా వర్తిస్తుందని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మాతృభాష ఎంతో విశిష్టమైనది



పుదూరు గురుకులంలో మాతృబాషా దినోత్సవం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ రూత్ రమోలా

నాయుడుపేట, ఫిబ్రవరి 21: ఏ ప్రాంతంలోనైనా, ఏదేశంలోనైనా మాతృభాష ఎంతో విశిష్టమైనదని గురుకుల ప్రిన్సిపాల్ రూత్ రమోలా అన్నారు. పుదూరులోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకురాలు తస్నీరు శశి పిల్లలకు బాలగేయ రచనలు, కవితల విశిష్టతలను విద్యార్థులకు తెలియజేశారు. కవితలతో రూపొందించిన బాల గేయాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, సునీత, భూలక్ష్మి, వరలక్ష్మి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటీ ఏజెన్సీలకు అప్పగించే ప్రయాత్నాలు మానుకోవాలని సీఐటీయూ నాయకులు పద్మనాభయ్య కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాయం ఎదుట పారిశుధ్య కార్మికులు నిరసన చేశారు. ఈ సందర్భంగా పద్మనాభయ్య మాట్లాడుతూ ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేసి పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు లక్ష్మయ్య, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వారీ వద్దే వద్దు

- ఆరిమేనిపాడు క్వారీ వద్ద గ్రామస్తుల నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



క్వారీ నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడుతున్న సీఐ సంగమేశ్వరరావు



గ్రావెల్ తరలింపు కోసం వచ్చిన టిప్పర్లు

ఓజిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం ఆరిమేనిపాడు గ్రావెల్ క్వారీ తమకు వద్దే వద్దని గ్రామస్తులు పెద్దఎత్తున నిరసన చేపట్టారు. రెండు రోజుల కిందట పోలీసు బందోబస్తు మధ్య క్వారీ నిర్వాహకులు గ్రావెల్ తరలించారు. దీంతో శుక్రవారం గ్రామస్తులంతా ఏకమై క్వారీ వద్దకు చేరుకుని సమీపంలో రోడ్డుకు అడ్డంగా కూర్చొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో కొండ తిప్పగా దాదాపు 200 ఎకరాలకు పైనే ఉందన్నారు. ఇది ఎప్పటినుంచో తమ పశువులకు, జీవాలకు మేత భూమిగా ఉంద న్నారు. ఈ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు తమ చెరువులకు చేరుతుందని వివరించారు. ఇక్కడ క్వారీలు ఏర్పాటుచేస్తే మొదట పశువులు, జీవాలకు మేత ఉండదని విచారం వ్యక్తం చేశారు. అలాగే తమ చెరువులు ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీ ఏర్పాటు కోసం అప్పట్లో జరిగిన అభిప్రాయ సేకరణలో తామంతా క్వారీని వ్యతిరేకించామని గుర్తుచేశారు. అయితే గ్రామానికి సంబంధంలేని వారితో సంతకాలు చేయించి అధికారులు ఈ తతంగాన్ని నడిపించారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరావు ఆధ్వర్యంలో ఓజిలి, దొరవారిసత్రం ఎస్ఐలు స్వప్న, అజయ్‌కుమార్ తమ సిబ్బందితో గ్రామస్తులకు నచ్చజెప్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ క్రమంలో క్వారీ అనుమతి పత్రాలు చూపాలని నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడారు. క్వారీ అనుమతుల గడువు తీరిపోయిందని ఇటీవల మళ్లీ పునరుద్ధరించుకున్నామని వారు బదులిచ్చారు. దీంతో పునరుద్ధరించిన అనుమతి పత్రాలు అందజేయాలని పోలీసులు సూచించారు. అలాగే శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని క్వారీ నుంచి ఎలాంటి తరలింపులు జరగకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు శాంతించారు.

పాఠశాల విలీనాన్ని ఆపాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు, తల్లిదండ్రులు

కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీలో గల విశ్వనాథపురం అగ్రహారం పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపాలంటూ శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. విశ్వనాథపురం అగ్రహారం ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను నెల్లూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో విలీనం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, సీనియర్ టీడీపీ నాయకులు, పెన్నక్క చెరువు సాగునీటిసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విలీనాన్ని ఆపాలని విశ్వనాథపురం అగ్రహారం పాఠశాలలోనే తరగతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు జయజయరావు, ఎంఈవో మస్తానయ్యలకు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై వారు స్పందిస్తూ ఉన్నతాధికారులకు నివేదించి విలీనాన్ని ఆపేందుకు కృషిచేస్తామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

భూగర్భ వనరుల దోపిడీ

- చెలరేగిపోతున్న మట్టి, గ్రావెల్, ఇసుక మాఫియా



మనవాలి చెరువులో ఏర్పడిన భారీ గోతి

ఓజిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో భూగర్భ వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. కొందరు మట్టి, గ్రావెల్, ఇసుక అక్రమ తరలింపును ప్రధాన ఆర్థిక వనరుగా మార్చుకుంటున్నారు. ఇక్కడికి సమీపంలోనే మేనకూరు సెజ్ ఉండటంతో పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు ఇసుక, మట్టి, గ్రావెల్ అవసరం దృష్ట్యా ఈ అక్రమ తరలింపు నిత్యం సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడపడితే అక్కడ ఇసుక, గ్రావెల్, మట్టి తరలింపు యథేచ్ఛగా కొనసాగింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం లోనూ అదే జరుగుతోంది. నీటిపారుదల, మైనింగ్ శాఖల కళ్లుగప్పి అడ్డదారిలో అక్రమాలకు పాల్పడుతున్నారు. మండలంలోని మనవాలి చెరువులో శుక్రవారం పెద్దఎత్తున మట్టి తరలింపు చేపట్టారు. మూడు రోజుల నుంచి ఇక్కడ మట్టి తరలించడంతో 15 అడుగుల లోతుగల భారీ గోతులు పడ్డాయి. గ్రావెల్, మట్టి, ఇసుక తరలిం పును అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే విజయశ్రీ



విద్యార్థి ఆరోగ్యాన్ని పరిక్షిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే టీడీపీ నాయకులు రమేష్, మాధవనాయుడు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల బస్సు ప్రమాదంలో గాయపడి సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ టీడీపీ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం ఆమె ఆస్పత్రి వైద్యులు రమేష్‌ను విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి వివరాలడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కావడంతో ఆమె స్వయంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు తదితరులు ఉన్నారు.

జేఎన్‌టీయూఏ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, పీడీ మల్లికార్జున్‌రెడ్డి

కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు జేఎన్‌టీయూఏ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఇక్కడ ఇంజనీరింగ్ చదువుతున్న ఇందు దర్శిని, ప్రసాద్ పులివెందుల జేఎన్‌టీయూఏ ఆధ్వర్యంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచారు. దీంతో వారు జేఎన్‌టీయూఏ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 25 నుంచి మార్చి 3వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ క్రీడాపోటీల్లో అనంతపురం జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారు. ఈ క్రీడలు తమిళనాడులోని సేలంలో గల పెరియార్ విశ్వ విద్యాలయంలో నిర్వహించనున్నారు. కాగా ఎంపికైన వారిని శుక్రవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు.

క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే క్యాట్ లెవల్-2 ఒలంపియాడ్ పరీక్షల్లో కోటలోని శ్రీచైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో ఎంఈవో శైలజ వారిని అభినందించినట్లు ప్రిన్సిపాల్ చిరంజీవి శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన 80 మంది విద్యార్థులు ఆయా ఒలంపియాడ్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అందులో 9 మంది విద్యార్థులు నగదు బహుమతి, మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌లు సాధించగా 34 మంది విద్యార్థులు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారు. వీరితో పాటు మరో 37 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు సాధించారు. ఆయా విద్యార్థులను ఎంఈవో శైలజ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జిలు వేణుగోపాల్‌రావు, డీన్ శివయ్య, హరిత, వినీల, నాగూర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట బడ్జెట్ రూ.23.60 కోట్లు

- ఆమోదం తెలిపిన మున్సిపల్ కౌన్సిల్



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, పక్కనే కమిషనర్ చిన్నయ్య

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశం శుక్రవారం కౌన్సిల్ హాలులో మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. 2025-26 సంవత్సరానికి రూ.23.60 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. ఈ దఫా అభివృద్ధి పనులతో పాటు ఇతర అవసరాలు, సిబ్బంది జీత భత్యాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపకల్పన చేసి కౌన్సిల్ ముందు పెట్టారు.

2024-25 బడ్జెట్‌తో పోలిస్తే 2025-26 బడ్జెట్ అంచనా శాతం తగ్గింది. గతేడాది (2024-25) రూ.27,83,36,153 అంచనా విలువతో బడ్జెట్ కేటాయింపు జరిగాయి. ఈ దఫా కొంతమేర సవరించి సుమారు రూ.4 కోట్ల మేర తగ్గించారు. గతేడాది బడ్జెట్ వసూళ్ల రూ.19 కోట్లు ఉండగా 2025-26కు రూ.15 కోట్లుగా అంచనా వేసింది కౌన్సిల్. 2024-25లో నగదు, బ్యాంకు నిల్వ వెరసి ముగింపు నిల్వ రూ.1,25,01,153 ఉండగా 2025-26లో నిల్వ రూ.2,01,01,153 ఉండవచ్చునని అంచనా వేశారు. 2024-25లో రాబడి ఆదాయ 36 శాతం ఉండగా 2025-26లో 40 శాతంగా ఉండవచ్చునని అంచనా వేశారు. మొత్తం 23.60 కోట్లతో కౌన్సిల్ ముందు ఉంచగా అందరూ ఏకీగ్రీవంగా ఆమోదించారు.

కౌన్సిల్ ముందుకు పలు సమస్యలు

బడ్జెట్ ఆమోదం అనంతరం వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణతో పాటు పలువురు కౌన్సిలర్లు పలు సమస్యలు కౌన్సిల్ ముందుకు తెచ్చారు. ముఖ్యంగా బజారు వీధుల్లో ఆక్రమణలకు గుర్రై కనీసం మోటారు సైకిళ్ల పార్కింగ్ చేసుకొనేందుకు స్థలం లేదని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అధికారులు ఆక్రమణలు తొలిగించి వాహనాల పార్కింగ్ కు స్థలం కేటాయించాలని వైస్ చైర్మన్ చిన్ని సత్యనారయణ కోరారు. కమిషనర్ చిన్నయ్య స్పందిస్తూ సమస్య పరిష్కరిస్తామన్నారు. రైల్వే గేటు సమీపంలో అండర్ బ్రిడ్జి కోసం తెచ్చిన సిమెంట్ దిమ్మెలు రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని వాటిని తొలగించాలని కౌన్సిలర్ శరత్ గౌడ్ కోరారు. పరిశ్రమలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలు ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మ, డీఈ శ్రీనివాసులు, టీపీవో బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ యువజన అధ్యక్షుడిగా పాలేటి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ యువజన అధ్యక్షుడుగా పాలేటి నాగార్జునను పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయన తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

సిమెంట్ రోడ్ల తనిఖీ

కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సిద్ధమ్మకండ్రిగ, ప్రకాశంకాలనీ, విజయకాలనీ, శ్యామ సుందరపురంలో వేసిన సిమెంట్ రోడ్లను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేశారు. క్వాలిటీ కంట్రోల్ జేఈ వెంకట కృష్ణయ్య ఆధ్వర్యంలో సిబ్బంది సిమెంట్‌రోడ్ల నాణ్యతను శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ కిరణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మాతృభాషను మరవద్దు

కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడు, కోటలోని బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం మాతృభాషా దినోత్సవం జరిగింది. ఎంఈవో మస్తానయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ మాతృబాషా దినోత్సవాలలో విద్యార్థులు తెలుగు ప్రాముఖ్యతను వివరిస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించారు. ఆయా విద్యార్థులను, హెచ్‌ఎంలను ఎంఈవో అభినందించారు.

ఎంపీడీవోగా మురళీకృష్ణ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎంపీడీవోగా ఏవీ. మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తడ మండల ఏవోగా ఉన్న మురళీకృష్ణను సూళ్లూరుపేట ఎంపీడీవోగా నియమిస్తూ నెల్లూరు జెడ్పీ సీఈవో విద్యారమ ఉత్తర్వులు జారీ చేశారు.

నేత్రదానం



ఆలపాటి సుమిత్ర (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వహిస్తున్న నేత్రదానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. శుక్ర వారం సూళ్లూరుపేటలోని వనంతోపునకు చెందిన ఆలపాటి సుమిత్ర (82) మరణాంతరం ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను చెన్నై శంకర నేత్రాలయకు దానం చేశారు. ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వాహకులు చంద్రబాబు, సాయిరాం పాల్గొన్నారు.

వైసీపీ మహిళా అధ్యక్షురాలిగా రత్నశ్రీ

నాయుడు పేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరు పేట నియోజకవర్గ వైసీపీ మహిళా అధ్యక్షు రాలుగా మేడిద రత్నశ్రీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్ఠానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మాజీ మంత్రి గౌతంరెడ్డికి నివాళులు

నాయుడుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు నివాళులర్పించారు. నెల్లూరులోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి నివాసంలో శుక్రవారం మాజీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఒట్టూరు కిషోర్‌యాదవ్, కటకం జయరామయ్య, పాలేటి నాగార్జున, గుండవల్లి సిద్ధయ్య, సుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, షబ్బీర్, ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

2.5 సవర్ల బంగారం చోరీ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పొగగొట్టం కాలనీలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పొగగొట్టం కాలనీలో ఉంటున్న జయరామయ్య ఇంటికి తాళం వేసుకుని వెళ్లాడు. గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 2.5 సవర్ల బంగారు, 100 గ్రాముల వెండి వస్తువులను చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ బాబి కేసు నమోదు చేశారు.

రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

సత్యవేడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కోసం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబంధిత బ్యాంకు అధికారుల సమక్షంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాళ్ళకుప్పం స్టేట్ బ్యాంక్ మేనేజర్ సూర్యప్రకాశం, శ్రీసిటీ కెనరా బ్యాంక్ మేనేజర్ యోగేంద్రనాథ్, దాసుకుప్పం గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాసవిహారి, సత్యవేడు గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సుబ్బారావు, స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ చైతన్య, కెనరా బ్యాంక్ మేనేజర్ కుశకుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

41 యూనిట్లకు అవకాశం

వరదయ్యపాళెం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు జరిగాయి. ఇందులో భాగంగా మండలానికి 41 యూనిట్లు మంజూరు కాగా 196మంది దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం జరిగిన ఇంటర్వ్యూలకు 164మంది హాజరైనట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. 41మందికి రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఆఫ్ ఇండియా, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహ్మద్‌రఫి పర్యవేక్షణలో బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 34 యూనిట్లు మంజూరయ్యాయి. మొత్తం 167 దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. ఉదయం సప్తగిరి గ్రామీణ బ్యాంకు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించగా మధ్యాహ్నం యూనియన్ బ్యాంకు అధికారులు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మన వారసత్వ సంపద



బహుమతులతో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు మన వారసత్వ సంపద అని భవిష్యత్ తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని తెలుగు ఉపాధ్యాయులు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి తెలిపారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుచ్చి నాయుడు కండ్రిగ, కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు కవులు, తెలుగు తల్లి వేషధారణలో ఆకట్టుకున్నారు. బుచ్చినాయుడు కండ్రిగలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. హెచ్ఎం రమణయ్య, రూపేష్ కుమార్, తెలుగు బాషా పండితుడు శ్రీనివాసులు, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషతోనే ప్రగతి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మాతృభాషతోనే ప్రగతి సాధ్యమని ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. తొట్టంబేడు మండలంలోని దిగువ సాంబయ్యపాళెం పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వర్ణమాల, తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులకు పద్య, క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు దేవి, అంగన్‌వాడీ కార్యకర్త మోహనరాణి తదితరులు పాల్గొన్నారు.

తల్లికి దహన సంస్కారాలు నిర్వహించిన కూతురు



తల్లికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు వెళ్తున్న భారతి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కన్నకూతురే కొడుకుగా మారి తల్లికి దహన సంస్కారాలు నిర్వహించింది. ఈ ఘటన ఏర్పేడు మండలం పంగూరులో చోటు చేసుకుంది. సుబ్బరామయ్య, పుల్లమ్మకు సుబ్బరత్న, భూదేవి, భారతి ముగ్గురు కుమార్తెలు. వారి చిన్నతనంలో తండ్రి మరణించాడు. తల్లే వారికి అన్నీ తానై విద్యాబుద్ధులు నేర్పించింది. చిన్న కూతురు భారతి పీలేరులో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఈ క్రమంలో గురువారం పుల్లమ్మ అనారోగ్యంతో మరణించింది. కుమారులు లేకపోవడంతో చిన్న కుమార్తె భారతి తానే తల్లికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది.

భక్తులకు మౌలిక వసతులు కల్పించండి



ఉత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో ఎమ్మెల్యే

నారాయణవనం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా కైలాసనాథ కోనకు వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో కైలాసనాథ కోన శివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్లను, కరపత్రాలను జడ్పీటీసీ సుమన్ కుమార్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అలాగే శివరాత్రి ముందు రోజు నుంచే ఆర్టీసీ బస్సులను నడపాలని అధికారులును కోరారు. కోనలో భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే శుక్రవారం తహసీల్దార్ జయరాములు కైలాస కోనలో శివరాత్రి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణ నాయక్, ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి: నలుగురిపై కేసు నమోదు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందిపై దాడి చేసిన నలుగురిపై శ్రీసిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీసిటీ పరిధిలోని మోపూరుపల్లిలో పాత నేరస్థుల కోసం హెడ్ కానిస్టేబుల్ హరిబాబు, కానిస్టేబుల్ హరి గాలిస్తుండగా అదే గ్రామానికి చెందిన చెరివి సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, బుజ్జమ్మ, రమణయ్య దాడికి పాల్పడ్డారు. దీంతో వారిపై కేసు నమోదు చేశారు. అయితే శ్రీసిటీ పోలీసులు కొందరు నిందితులకు తెర వెనుక సహకారం అందించారనే విమర్శలున్నాయి. నిందితులను అరెస్టు చేసిన వెంటనే రిమాండ్‌కు పంపుతారు. అలాకాకుండాఈ కేసులో వరదయ్యపాళెం తహసీల్దారు వద్ద బైండోవర్ చేయడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు.

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

నాగలాపురం, ఫిబ్రవరి 21, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్యే ఆదిమూలం శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. నాగలాపురం తూర్పు దళితవాడలో రూ.5లక్షలతో నిర్మించిన ‘ సిమెంటు రోడ్లను ప్రారంభించారు. అలాగే వడ్లకుప్పంలో రూ.13.50 లక్షలతో నిర్మించిన తాగునీటి పైపులైన్‌ను ప్రారంభించారు. గ్రామాల్లో కనీస వసతులు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు ఉదయం 10 గంటలకు ఈనెల 18న మృతి చెందిన టీడీపీ నాయకుడు రామచంద్రన్ కుటుంబీకులను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, నాయకులు సెల్వకుమార్, మురళి, పార్తిబన్, ఎం.డి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నం వాసుదేవ నాయుడు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నం వాసుదేవనాయుడిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి నియమించారు. శుక్రవారం నియామక ఉత్వర్వులను అందజేశారు. ఈ సందర్భంగా వాసుదేవనాయుడు మాట్లాడుతూ... తనకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌కు, మాజీ మంత్రి పెద్దిరెడ్డికి, జిల్లా అధ్యక్షుడు భూమననకు, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మాల కార్పొరేషన్ చైర్మన్‌తో జనసేన నాయకుల భేటీ



వరదయ్యపాళెం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు పర్యటనకు విచ్చేసిన మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్‌ను వరదయ్యపాళెం జనసేన నాయకులు చిత్తూరు నగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీలపై పెట్టిన అక్రమ కేసుల ను ప్రస్తావించారు. సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తడ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, విజయకుమార్, రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కామధేనువుపై గౌరీపతి పుర విహారం

శివనామ స్మరణలతో మార్మోగిన ఆలయ పరిసరాలు





యాగశాల పూజలు - తిరువీధి ఉత్సవానికి కామధేనువుపై బయలుదేరిన స్వామి, చప్పరంపై అనుసరిస్తున్న అమ్మవారు

నాగలాపురం, ఫిబ్రవరి 21, (ఆంధ్రజ్యోతి): సురుటుపల్లె సర్వమంగళాదేవి సమేత పల్లికొండేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజైన శుక్రవారం గౌరీపతి కామధేనువుని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. కోరిన వెంటనే వరాలిచ్చే కామధేనువుపై భక్తుల కోర్కెలు నెరవేర్చే భోళా శంకరుడు, చప్పరంపై ఆసీనులైన పార్వతీ దేవితో కలిసి దర్శనమీయడంతో భక్తులు ఆనంద పారవశ్యులై కర్పూర నీరాజనాలు సమర్పించారు. వేదమంత్రోచ్ఛారణలు, కేరళ వాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్ల వాహన సేవ సుమారు 3 గంటల పాటూ కనులపండువగా సాగింది. వాహన సేవ సమయంలో భక్తుల నమశ్శివాయ స్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అంతకుముందు ఉదయం ఆలయ శుద్ధి అనంతరం మూలస్థాన దేవతలైన మరగదాంబిక, వాల్మీకేశ్వరస్వామికి సర్వాభిషేకాలు చేశారు. యాగశాల వైదిక కార్యక్రమాలను శైవాగమంగా నిర్వహించారు. రాత్రి వాహన సేవానంతరం కార్యక్రమాలను పరిసమాప్తి చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, భజన బృందాలు భక్తులను ఆకట్టుకున్నారు. ఈ పూజలకు చెన్నైకి చెందిన నరసింహులు, రేవతి కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లతఆధ్వర్యంలో సిబ్బంది దండపాణి, పరంధామరెడ్డి సిబ్బందితో కలసి పర్యవేక్షించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న బృందమ్మ తదితరులు - హాజరైన కళాకారులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శ్రీ కా ళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహా శివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ధూర్జటి కళాప్రాంగణంలో ఘనంగా ప్రారంభమ య్యాయి. ఈవో బాపిరెడ్డి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అందులో భాగంగా సాయంత్రం 6గంటలకు పట్టణానికి చెందిన జాతీయ అవార్డు గ్రహీత ఏఎస్ ఆషా ప్రదర్శించిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. 8గంటలకు నాయుడుపేటకు చెందిన శ్రీలక్ష్మి భరత నాట్య ప్రదర్శన, 9.30గంటలకు తిరుపతికి చెందిన తలారి రోజశ్రీ నృత్య ప్రదర్శన, 10.30 గంటలకు చెన్నైకు చెందిన ఉమా రాణి, రాజేశ్వరి భక్తిరంజని ఆకట్టుకుంది. 11.30 గంటలకు నెల్లూరుకు చెందిన మధుప్రియ నాట్యమండలి ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం అలరించింది. ఆలయ అధికారులు వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

మీడియా పాయింట్ ప్రారంభం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈవో బాపిరెడ్డి మీడియా పాయింట్‌ను ప్రారంభించారు. మీడియా పాయింట్ నుంచి విలేకరులు సమాచారాన్ని పంపించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విలేకరులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కేంద్రం పరిశీలన



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సుదీర్ తల్లి బృందమ్మ తనిఖీ చేశారు. ఆహార నాణ్యతను పరిశీలించారు. సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. భక్తులను ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి: ఎస్పీ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పోలీసులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని నాలుగు మాడ వీధులు, సన్నిధివీధిలో పర్యటించారు. భక్తులు ఇబ్బంది పడకుండా క్యూలైన్లు ఉండాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తుల వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. వందశాతం హోల్డింగ్ పాయింట్లలో వాహనాలు నిలపకుండా ఖాళీగా ఉండే విధంగా చూడాలన్నారు. డ్రోన్ల సాయంతో భక్తుల రద్దీని ఎప్పటికపుడు అంచనా వేయాలన్నారు. ఈవోను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ హేమంత్, డీఎస్పీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు యూనిఫాం పంపిణీ

రేణిగుంట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల్లో చదివే చిన్నారులకు యూనిఫాంను ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ పంపిణీ చేసింది. మండల పరిధిలోని వెదళ్లచెరువు గిరిజన కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ఉదయ్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమేష్, వార్డు మెంబర్ కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

70 శాతం వెబ్ ల్యాండింగ్ పూర్తి

రేణిగుంట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : రేణిగుంట మండల పరిధిలో ఇప్పటికే రైతులు 70 శాతం ల్యాండింగ్ పూర్తి చేసుకు న్నారని మండల వ్యవసాయ అధికారి సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఎల్లమండ్యం పంచాయతీ పరిధిలో రైతు రిజిస్టర్ క్యాంపెయిన్ నిర్వహించారు. భూమి ఉన్న ప్రతి ఒక్కరూ రైతు రిజిస్టర్ నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత



దొడ్లమిట్టలో బాధితులతో మాట్లాడుతున్న వినుత

రేణిగుంట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కడప నేషనల్ హైవే నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని శ్రీకాళహస్తి జనసేన ఇంచార్జి కోట వినుత తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కరకంబాడి పంచాయతీలో రేణిగుంట- కడప జాతీయ రహదారి నిర్మాణానికి ఇళ్ల కోల్పోయిన దొడ్లమిట్టను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కమిషన్లు తీసుకుని వారి వ్యక్తులకు భారీ మొత్తంలో పరిహారం చెల్లించి మిగిలిన బాధితులకు తక్కువ ధర ఇవ్వజూపారన్నారు. నగరం భాస్కర్, మోహన్, నాగరాజు, భాగ్యలక్ష్మి, తిలక్, బాలాజీ, ముఖేష్, అనుధార, సతీష్, దీనదయాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంకు ఈఎస్ఐని అనుసంధానించండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రికి ఈఎస్ఐ సౌకర్యాన్ని అనుసంధానం చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ఆస్పత్రి డైరెక్టర్ గూడ్లూరు మయూర్ కోరారు. విజయవాడలో శుక్రవారం మంత్రి సత్యకు మార్‌ను కలిసి ముక్కంటి శేషవస్త్రంతో సత్క రించి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి పరసరాల్లో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని అక్కడ పనిచేసే వారి సౌకర్యార్థం ఎంజీఎంకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ త్వరలోనే ఈఎస్ఐ అనుమతిస్తామని తెలిపారు. తాను త్వరలో ఎంజీఎం ఆస్పత్రిని సందర్శిస్తానని హామీ ఇచ్చారు.

ఆలయానికి గొడుగుల వితరణ



శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చెన్నైకు చెందిన హిందూ ధర్మార్థ సమితి ట్రస్టు ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్ఆర్ గోపాల్ గొడుగులను వితరణ చేశారు. ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అదే విధంగా శ్రీకాళహస్తి ఆలయంలో అన్నదానానికి నంద్యాలకు చెందిన ప్రసాద్ 25టన్నుల కూరగాయలను వితరణ చేశారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

సత్యవేడు, ఫిబ్రవరి 21: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను తరలించే బస్సులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శ్రీసిటీ పరిధిలో శుక్రవారం పుత్తూరు ఎంవీఐ చంద్రశేఖర్‌తో కలిసి పలు స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల బస్సులు ఎల్లప్పుడు కండిషన్‌లో ఉంచుకోవాలని, హెవీ లైసెన్స్, అనుభవం ఉన్న డ్రైవర్లను నియమించుకోవాలని తెలిపారు. పరిమితికిమించి విద్యార్థులను తరలించరాదన్నారు. కాగా తనిఖీల్లో రికార్డులు సక్రమంగా లేని పలు స్కూల్ బస్సులకు రూ.31,710 జరిమానా విధించారు.

బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా నేరమే

కేవీబీపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేసినా ప్రోత్సహించినా నేరమని సీడీపీవో శోభారాణి హెచ్చరించారు. కేవీబీపురం అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో 18 సంవత్సరాల్లోపు బాలికల వివరాలను సేకరించాలన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చట్టవిరుద్ధమన్నారు. మగవారికి 21 సంవత్సరాలు నిండాలని చెప్పారు. 18 సంవత్సరాల లోపు బాలికలు ఏ గ్రామంలో అయినా ఖాళీగా ఉంటే వారిని డ్రాపౌట్ కింద పరగణించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పుస్తకాలు మోసే వయసులో పుస్తెలు భారం కాకూడదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కల్పలత, సుమతి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రి నిత్య ఉత్సవాల వివరాలు..

- ఉదయం- 4.30 గంటలకు మంగళ వాయిద్యాలు
- ఉదయం- 5.00 గంటలకు గోపూజ, సుప్రభాతం, సర్వదర్శనం
- ఉదయం- 6.00 గంటలకు ప్రథమ కాల అభిషేకం
- ఉదయం- 7.00గంటలకు ద్వితీయ కాల అభిషేకం
- ఉదయం- 8.00 గంటలకు పరివార దేవాలయాల నైవేద్యం
- ఉదయం- 9.00 గంటలకు స్వామిఅమ్మవార్ల ఉత్సవం
- ఉదయం- 10:30 గంటలకు ఉచ్చికాల అభిషేకం
- మధ్యాహ్నం- 12:05 గంటలకు కొడి దారం పురవీధుల ఊరేగింపు, ధ్వజ స్తంభానికి దర్భతాడు కట్టడం
- మధ్యాహ్నం- 1.00 గంటకు ధ్వజారోహణ సంకల్పం ఆరంభం
- మధ్యాహ్నం- 2:30 గంటలకు స్వామివారి ధ్వజారోహణం
- మధ్యాహ్నం- 4.00 గంటలకు నైవేద్య, దీపారాధనలు
- సాయంత్రం- 5.30 గంటలకు ప్రదోష కాలాభిషేకం
- సాయంత్రం- 6.00 నుంచి 8.00 గంటల వరకు యాగశాల పూజ
- రాత్రి- 8.00 గంటలకు స్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- రాత్రి- 9:30 గంటలకు దర్శనం ముగింపు